J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 16 19.9.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## జిల్లాకి... కొత్త కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా



నెల్లూరు జిల్లా కొత్త కలెక్టర్‌గా రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా ఈనెల 13న నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు. ..10లో



● రాజధాని రగడ

# మాట మార్చిన వైసీపీ - స్వరం పెంచిన టీడీపీ

- జగన్ పార్టీ యూటర్న్
- దుమ్మెత్తిపోస్తున్న తెలుగుదేశం
- మళ్ళీ తామొస్తే అమరావతి నుంచే పాలన అంటూ వైసీపీ ప్రకటన
- ఓట్ల రాజకీయంలో భాగమే అంటూ టీడీపీ విమర్శలు

అమరావతి.. గత దశాబ్ద కాలానికిపైగా రాష్ట్రంలో అత్యధికంగా చర్చనీయాశంమైన పేరు. ప్రధాని మోడీ నుంచి సగటు పౌరుడి వరకు ప్రస్తావించిన పేరు. ప్రభుత్వాలను మార్చిన పేరు. పాలకులను గద్దెదించిన పేరు. భూమిలిచ్చిన రైతులు నిత్యం జపిస్తున్న పేరు. అధికార, ప్రతిపక్షాల మధ్య సవాళ్లు-ప్రతిసవాళ్లకు వేదికైన పేరు. అయితే, ఎన్నికల ఫలితాల తర్వాత కొంతకాలంగా దీనిపై కొంత స్తబ్ధత నెలకొన్నా.. తాజాగా మళ్లీ రాష్ట్ర రాజకీయాల్లో రాజధాని అంశం కల్లోలం సృష్టిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులంటూ మూడుముక్కలాట ఆడిన వైసీపీ, దెబ్బతింటే కానీ తత్వం బోధపడదన్న చందంగా... ఎన్నికల్లో ఓటమి తర్వాత అమరావతి అంశంపై యూటర్న్ తీసుకున్నట్లు కనిపిస్తోంది. 10లో

## తొలి మహిళా పోలీసు బాసుగా అజిత వేజెండ్ల



నెల్లూరుజిల్లా ఎస్పీగా విశాఖలో డీసీపీగా పనిచేస్తున్న అజిత వేజెండ్ల ఈనెల 15న నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ..10లో


## శ్రద్ధాంజలి

"అజరామరం మీ స్ఫూర్తి
ఆచంద్రతారార్కం మీ కీర్తి"

స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి గారి సతీమణి

**శ్రీమతి మాగుంట పార్వతమ్మ గారు**

మాజీ పార్లమెంటు సభ్యురాలు, మాజీ శాసనసభ్యురాలు

ప్రథమ వర్ధంతి సందర్భంగా

వారి దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ...

కుటుంబసభ్యులు
మరియు బంధుమిత్రులు



జననం : 27.07.1947 నిర్యాణం : 25.09.2024

# పాత లగేజీని వదిలించుకుంటేనే!



2019 నాటి అసెంబ్లీ ఎన్నికలప్పటి నుండి 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేసిన నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి కుమారుడు జగన్మోహనరెడ్డి... మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని బలంగా అభిలషిస్తున్నారు. అందులో తప్పు పట్టవలసింది ఏమీలేదు. ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల్లో గెలవడమూ... ఓడిపోవడమూ మన దేశంలో సహజంగా జరుగుతున్నదే. ఎన్నికల్లో విజయం సాధించడానికి రాజకీయ పార్టీలకు రెండు మార్గాలు ఉన్నాయి.

"ఎదుటి పక్షం అంతా ఉత్తి వెధవాయిలు. మమ్మల్ని గెలిపిస్తే.... చించి పోగులుపెడతాం" అనే ప్రచారంతో ఊదరగొట్టి, ఎన్నికల ఫలితాన్ని హైజాక్ చేశారా అన్నట్టుగా గెలవడం ఒక మార్గం.

2019లో వైసీపీ, 2024లో తెలుగుదేశం కూటమి గెలిచింది ఈ విధానంలోనే. ఒక రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎలా నడపకూడదో... 2014-2019 మధ్యకాలంలో చంద్రబాబునాయుడు చూపెడితే.. 2019-2024 మధ్య జగన్మోహన్‌రెడ్డి చూపించారు. చంద్రబాబుపై తీవ్ర వ్యతిరేకతతో అప్పుడు జగన్మోహన్ రెడ్డికి ప్రజలు అవకాశం ఇస్తే.. మళ్ళీ జగన్‌రెడ్డిపై తీవ్రాతితీవ్ర వ్యతిరేకతతో తిరిగి చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర పాలనా పగ్గాలు అప్పచెప్పక తప్పని స్థితిలో ప్రజలు పడిపోయారు. అందుకు, బాధ్యత నూటికి నూరు శాతం జగన్మోహన్‌రెడ్డి, ఆయన పరివారానిదే తప్ప ప్రజలది కాదు.

1. ప్రజలు ఎన్నుకున్నది వై.ఎస్.రాజశేఖరరెడ్డి కుమారుడు జగన్‌ను. ఆయన మాత్రం తన తరపున, తాను నమ్మిన సజ్జల రామకృష్ణారెడ్డికి ప్రధాన సలహాదారు హోదా కల్పించి, మొత్తం అధికార యంత్రాంగాన్ని ఆయనకు అప్పగించారు. ఆయన మంత్రి కాదు, శాసనసభ్యుడు కాదు, శాసనమండలి సభ్యుడు కాదు, ప్రజా జీవితంలో అసలు ఏమీకాదు.

జమ్ము-కశ్మీర్‌లో భారీ వర్షాలకు ఒక్కసారిగా విరిగిపడే కొండచరియల కింద నలిగిపోయే యాత్రికుల్లా... ఒక్కసారిగా వచ్చిపడిన అవధులు లేని సజ్జల అధికారం కింద వైసీపీ పడి... నుజ్జునుజ్జుగా నలిగిపోయింది. ఫలితంగా జగన్ అధికార సౌధం... ఉత్తరాఖండ్ మెరుపు వరదల్లో కూలిపోయిన భారీ భవనాల్లా... ప్రజాగ్రహంలో కూలిపోయింది.

అది ఎంతగా అంటే... "కాళ్ళి పడేస్తా నా కొడకల్లారా!" అంటూ ఒక డీఎస్పీ వైసీపీ కార్యకర్తల్ని(మూకల్ని) చూసి కళ్లెర్ర చేసేంతగా వైసీపీ స్థాయి పడిపోయింది. అదీ, తమ కుటుంబ స్థావరమైన పులివెందులలో. చంద్రబాబు స్థావరమైన కుప్పంలో కాదు. ప్రజా జీవితంలో కొన్ని ఎన్నికల పాటు కొనసాగాలనుకునే నాయకులు ఎవరూ ఇంత బాధ్యతారాహిత్యం, నిష్పేచీగా వ్యవహరించరు.

సజ్జలని వైసీపీ / జగన్ తరపున ప్రజాజీవితంలో కొనసాగించాలో వద్దో జగన్ నిర్ణయించుకోవాలనేది ఆ పార్టీ పట్ల సదభిప్రాయం ఉన్నవారు ఖరాకండిగా చెబుతున్న మాట.

2. సజ్జలతో పాటు, జగన్‌కు పాత గుదిబండలు చాలా ఉన్నాయని పరిశీలకులు చెబుతుంటారు. నేరచరితులతో వైసీపీని నింపేయడం, వారి చేతికి అధికారం అప్పచెప్పేయడంతో, జగన్‌పై ప్రజల్లో 'నెగటివ్ పెర్సెప్షన్' ఏర్పడడం మొదలైంది. వారిలో ఒక్కరుకూడా 2024 ఎన్నికల్లో అసెంబ్లీకి ఎన్నిక కాలేదు. వారి అరాచకం 2019-24 మధ్య ఏ స్థాయిలో ఉందో దీనిని బట్టి అర్థం చేసుకోదలుచుకుంటే... అర్థం చేసుకోవచ్చు.

3. అసలు అవినీతికి పాల్పడాల్సిన అవసరం జగన్‌కు ఉందా? ఆయన అధికారంలోకి రాకముందే, భారీ అవినీతికి పాల్పడి, వేలాది కోట్ల రూపాయల విలువైన ఆస్తులు, నగదు సంపాదించారంటూ ఆయనపై సీబీఐ ఓ డజను కేసులు పెట్టింది. ఆ కేసుల్లో విచారణ అంగుళం కూడా ముందుకు సాగకుండా... జగన్ శతధా ప్రయత్నిస్తున్నారనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. తాను నిర్దోషి అని జగన్ భావిస్తూ ఉంటే.. వాటి విచారణ వీలైనంత త్వరితగతిన ముగింపచేసి, కడిగిన ముత్యంలా ప్రజా క్షేత్రంలో వెలుగొందవచ్చు. కానీ, ఆ పని చేయడం లేదు.

అయినప్పటికీ ముఖ్యమంత్రి అయ్యాక, ఇక అవినీతి ఎందుకంటూ జనం ఆశ్చర్యపోతున్నారు. రాజశేఖర్‌రెడ్డి వారసుడిగా జగన్‌ను జనం చూశారు. మరి, జగన్‌కు వారసుడుగా జనం ఎవరిని చూడాలి!?

ఆయనకు ముత్యాల లాంటి కుమార్తెలు ఇద్దరూ ఆంధ్రకు తిరిగివచ్చి, ఈ మురికి... కుళ్ళు రాజకీయాలలో వేలు పెడతారని ఎవ్వరూ భావించడం లేదు. ఉన్నత విద్యావంతులుగా వారు ఆయా విదేశాల్లోనే ప్రకాశిస్తుంటారనే భావం సమాజంలో ఉంది. వారికి ఈ నెత్తురుకూటితో పని బడకపోవచ్చు కూడా. మహారాజాలా జీవించడానికి, జగన్‌కు ఇప్పుడున్న ఆస్తి పాస్తులు వంద రెట్లు ఎక్కువ! మరి అవినీతి, డబ్బు సంపాదనపై ఆసక్తి జగన్‌కు ఎందుకో అర్థం కాదు.

తాను ముఖ్యమంత్రి కావడం కోసం ఆయన 2011 మార్చి నెలలో వైఎస్సార్‌సీపీ అనే పార్టీ పెట్టుకున్నారు. పేకమేడ లాంటి ఆ పార్టీని పెట్టుకున్న లక్ష్యం నెరవేరింది. ఆయన ముఖ్యమంత్రి అయ్యారు.

ఇక... ఆ కాన్సెప్ట్, ఆ మనుషులు, ఆ పద్ధతులు, ఆ సలహాదారులు, ఆ వ్యవహారశైలి, ఆ కక్ష-కార్పణ్యాల ధృక్పథం, చంద్రబాబు వ్యతిరేక రాజకీయ వైఖరి, మేము వచ్చాక... చింపుతాం అనే ధోరణి, అసత్యాల భారీ ప్రచారం ఇప్పుడు పనిచేయవు.

దీపావళి కోసం తయారు చేసిన చిచ్చుబుడ్డి, కాకర పువ్వొత్తి, అవ్వాయ్-సువ్వాయ్‌లు ఒక్కసారే వెలుగులు చిమ్ముతాయ్. రెండోసారి పని చెయ్యవు. "మొన్న పని చేశాయి కదా ఇప్పుడెందుకు చిచ్చుబుడ్డి వెలుగులు చిమ్మట్..." అని ప్రశ్నిస్తూ వాటిని బట్టుకునే వేళ్లాడదామని అనుకుంటే.... ఎవరు మాత్రం చేయగలిగింది ఏముంది?

ఇప్పుడు పూర్తిగా "పాజిటివ్ మోడ్"లోకి జగన్ రావాలని, ఆయన రాజకీయాలలో కొనసాగాలని కోరుకునే శ్రేయోభిలాషులు కొందరు భావిస్తున్నారు. Mental changeover is the need of the hour.

ఆయన నెత్తిమీద ఇప్పటికే పుట్టెడు కేసులు ఉన్నాయి. ఒక చేత్తో వాటిని మేనేజ్ చేసుకుంటూ... మరో చేత్తో విద్వేష రాజకీయాలను నడపడం వల్ల, ప్రజాభిమానం పొందడం దుర్లభం.

చంద్రుడు పూర్తిగా పట్టేసిన తలలా ఇప్పుడు వైసీపీ... జనానికి కన్పిస్తుంది. దువ్వెనకు, కొమ్ము దువ్వెనకు, షాంపూకు చంద్రుడు లొంగకపోతే కూడా... దాని పని పట్టడానికి మార్గం ఉంది. తిరుమల వెళ్లి, దేవుడికి తల నీలాలు సమర్పిస్తే.... చంద్రుడు సమస్య పరిష్కారం అవుతుంది. ఎంతోకొంత పుణ్యం మన అకౌంట్‌లో పడుతుంది.

అందుకే, వైసీపీకి పట్టిన చంద్రుడును ముందుగా జగన్ వదిలించుకోవాలి. ఇందుకోసం తనను అభిమానించే శ్రేయోభిలాషులతో జగన్ మేధోమథనం నిర్వహించాలి. 2024 ఎన్నికల్లో ఎక్కడ... ఎలా రైలు పట్టాలు తప్పిందో క్షుణ్ణంగా చర్చించాలి. భవిష్యత్ రాజకీయ ప్రయాణానికి ఒక బ్లూ ప్రింట్ రూపొందించుకోవాలి. దాని ప్రకారం ముందుకు అడుగువేయాలి.

అంత సహనం, వివేకం, దూరదృష్టి, అవగాహన జగన్‌కు ఉన్నాయా!?

అవేమీ జగన్‌కు లేవని, అందువల్ల తనకు 2029లో కూడా విజయం ఖాయమనే అంచనాతో చంద్రబాబునాయుడు దూసుకు వెళుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలి అంటే.. నేల విడిచి సాము చేస్తున్నారు. తెలుగుదేశం కార్యకర్తల్లో అసంతృప్తి బయలుదేరింది. రానున్న రోజుల్లో ఈ అసంతృప్తి వేగం అందుకుంటుంది. ఈ రాజకీయ పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకోవాలి అనుకుంటే... జగన్‌లో కూడా మార్పు 100శాతం అవసరం. రాజశేఖర్‌రెడ్డి కుమారుడిగా తనను అభిమానించే వారు ఒక్క రెడ్డి కులంలోనే కాదు. అన్ని కులాల్లోను ఉన్నారు. అన్ని కులాలవారూ ఓట్లు వేస్తేనే ఆయన గెలిచారు. జగన్ అంటే అభిమానం ఉన్నవారు కూడా జగన్ "ఫ్యాక్షన్ రాజకీయాల"ను హర్షించరు. పిల్లాడు ముద్దు వస్తున్నాడని చంకనెక్కించుకుంటారు గదా అని ముక్కులో చీమిడి తీసి ఒళ్లంతా పామేస్తాం అంటే పద్ధతి కాదు కదా.

ఇప్పటికైనా జగన్ జనం నాడి తెలుసుకుని తనకి, తన పార్టీకి బరువుగా మారిన పాత లగేజీని వదిలించుకుంటేనే ఆయనకి రాజకీయ పునర్జన్మ!

**- భోగాది వేంకట రాయుడు**



## ఆత్మకూరులో మెగా రక్తదాన శిబిరం

భారత ప్రధాని నరేంద్రమోడీ 75వ జన్మదినోత్సవం సందర్భంగా భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఇటీవల జరిగిన మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేస్తున్న ఆత్మకూరు భాజపా నాయకులు, కార్యకర్తలు, మోడీ అభిమానులు, విద్యార్థులు.



## సర్దార్ పటేల్ సేవలు మార్గదర్శకం

### ○ బీజేపీ ఆధ్వర్యంలో సమైక్యతా దినం



సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు మార్గదర్శకమని బీజేపీ నాయకులు చెప్పారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ఈనెల 17న నెల్లూరులోని రిత్విక్ ఎన్‌క్లేవ్ వద్దనున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ, పటేల్ భారత హోంశాఖ మంత్రిగా ఉన్న సమయంలో దేశంలోని అన్ని సంస్థానాలను, రాజులను ఒప్పించి దేశంలో విలీనం చేశారన్నారు. అన్ని సంస్థానాలు సెప్టెంబరు 17న విలీనం కావడంతో ఆ రోజును జాతీయ సమైక్యతా దినంగా ప్రధాని మోడీ ప్రకటించారని వివరించారు. బీజేపీ నాయకులు మండ్ల ఈశ్వరయ్య, గడ్డం విజయకుమార్, మొగరాల సురేష్, పెంచలయ్య, ఫణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టానుసారం మందులు వేసుకోవద్దు

### ○ అవగాహన ర్యాలీలో వైద్యులు

వైద్యుల సలహా లేకుండా ఎవరిష్టప్రకారం వారు మందులు వేసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదంటూ ఈనెల 17న నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ప్రజలకు అవగాహన కలిగించేందుకు ప్రదర్శన నిర్వహించారు. ఫార్మాకోలమ్ విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఈ ర్యాలీ చేపట్టారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మస్తాన్‌బాషా, ఫార్మాకోలమ్ విభాగాధిపతి డాక్టర్ రాధికారాణి, డాక్టర్ మునీర్‌ఖన్నా, డాక్టర్ వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రధాని జన్మదినోత్సవాన వాటర్‌ప్లాంట్ల ప్రారంభం

వింజమూరులోని ధరణి సేవా సమితి ఆధ్వర్యంలో తమిళనాడుకు చెందిన జేసన్స్ ఇండస్ట్రీస్ వారి సౌజన్యంతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని బొమ్మరాజు చెరువు, దూబగుంటలలో వాటర్‌ప్లాంట్లను ప్రారంభిస్తున్న సేవాసమితి ప్రతినిధి యల్లాల రఘురామిరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు గోపిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు.



## ఢిల్లీలో..ఫైనాన్స్ కమిటీ సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, ఫైనాన్స్ కమిటీ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈ నెల 18 గురువారం ఢిల్లీలోని సంవిధాన్ సదన్‌లో జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి ముందు ఫైనాన్స్ కమిటీ సభ్యులకు ప్రత్యేక ఫొటో సెషన్ నిర్వహించారు. ఈ ఫొటో సెషన్‌లో మిగతా కమిటీ సభ్యులతో వేమిరెడ్డి కూడా ఫొటోలు తీసుకున్నారు. అనంతరం కమిటీ సమావేశంలో పాల్గొని వివిధ ఆర్థిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

## పర్యావరణాన్ని కాపాడుకోవాలి

- కమిషనర్ నందన్



పర్యావరణాన్ని కాపాడుకోవాలని, పచ్చదనాన్ని-పరిశుభ్రతను పరిరక్షించుకోవాలని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ నందన్ పిలుపునిచ్చారు. ఈనెల 17న ఆయన నగరంలో 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో పాల్గొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు వేయకూడదని ప్రజలకు సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగించకూడదని చెప్పారు. ప్రతి ఒక్కరూ పర్యావరణం-పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకుంటేనే స్వచ్ఛ నెల్లూరు సాధ్యమవుతుందన్నారు. తొలుత స్థానిక విఆర్ కూడలి వద్ద పర్యావరణంపై అవగాహన ర్యాలీకి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్పొరేషన్ ఎస్ఇ రామ్మోహన్, సీపీ హిమబిందు, ఎంహెచ్ఓ కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన సమాచారశాఖ డీడీ



జిల్లా సమాచార పౌరసంబంధ శాఖ డిప్యూటి డైరెక్టర్‌గా పి.వేణుగోపాల్‌రెడ్డి ఈనెల 17న నెల్లూరు కలెక్టరేట్‌లోని ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను, జేసీ కార్తీక్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## బంగారు దుకాణాల్లో..అధికారుల తనిఖీలు

నెల్లూరులోని పలు బంగారు దుకాణాలను ఈనెల 17న ఇన్‌కంటాక్స్ అధికారులు తనిఖీ చేశారు. పన్నులు చెల్లించకుండా వ్యాపారాలు చేస్తున్న ఆ దుకాణాలను ఆకస్మికంగా పరిశీలించి, రికార్డులు చూసి, బిల్లులపై వివరాలడిగారు. ఈనెల 17వ తేది ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలోని ఆచారివీధి, కాపువీధి, చిన్నబజారు తదితర ప్రాంతాల్లో ఐటీ అధికారులు ఏకకాలంలో ఈ దాడులు నిర్వహించారు. వ్యాపార లావాదేవీల్లో అవకతవకలేమైనా జరిగాయా అని ఆరా తీశారు.


స్మృత్యంజలి



శ్రీమతి మాగుంట పార్వతమ్మ

ప్రథమ వర్ధంతి : 25.09.2025

అక్కా...
అనురాగం
అభిమానం
అనుబంధం
ఆప్యాయత
ఆత్మీయత
ఆదరణ
ఆశీస్సులు
వీటన్నిటి ప్రతిరూపమే మీరు.

మీ స్మృతిలో... మీ.. తమ్ముడు


# అతివేగం.. 7 ప్రాణాలు తీసింది

## ➢ పెరమన వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ఏడుగురు దుర్మరణం

**అ**తివేగం ప్రాణాలు తీసింది. ఏడుగురి ప్రాణాలను మింగేసింది. మరో పది నిమిషాల్లో గమ్యస్థానానికి చేరుకోబోతుండగానే మార్గమధ్యంలో మృత్యువు వారిని పొట్టన పెట్టుకుంది.



ఈనెల 17న నెల్లూరుజిల్లా సంగం మండలం పెరమన గ్రామం వద్ద ముంబై జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం జిల్లాప్రజలను కలచివేసింది. నెల్లూరులోని గుర్రాలమడుగు సంఘానికి చెందిన తాళ్ళూరు శ్రీనివాసులు-రాధ దంపతులు కారులో తమ బంధువులైన శేషం సారమ్మ, శేషం బాలవెంగయ్య, చల్లగుండ్ల శ్రీనివాసులు, లక్ష్మి దంపతులు కత్తి బ్రహ్మయ్యలతో కలసి ఆత్మకూరులోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు బయలుదేరి వెళ్ళారు. అక్కడినుంచి వరికుంటపాడు మండలం జంగారెడ్డిపల్లెలో పెళ్ళికి వెళ్ళాలని అనుకున్నారు.

మార్గమధ్యంలో పెరమనకొండ వద్ద టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో కారు టిప్పరు కింద నలిగిపోయి నుజ్జునుజ్జయింది. కారు నడుపుతున్న బ్రహ్మయ్యతో సహా, కారులో ఉన్న వారంతా అక్కడి కక్కడే దుర్మరణం పాలయ్యారు. పోలీసులు హుటాహుటిన వచ్చి మృతదేహాలను కారు నుంచి బయటకుతీసి పోస్టుమార్టమ్‌కి తరలించారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లతో పాటు పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.



## మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

- నేతల హామీ

పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం బాధాకరమని, ఏడుగురు ఈ దుర్ఘటనలో మరణించడం ఆవేదన కలిగిస్తోందని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, జిల్లా మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డా. పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ తదితరులు ఈ దుర్ఘటన పట్ల బాధను వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

లాయర్
సెప్టెంబర్ 19, 2025

# సమస్యల సుడిలో.. సాంకేతిక విద్య!

నేటి ఆధునిక కాలంలో ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక నైపుణ్య విద్య శరవేగంగా విస్తరిస్తున్నా, మనదేశం మాత్రం ఇంకా ఎంతగానో వెనుకబడే ఉంది. ఏ దేశ భవితకైనా సాంకేతిక విద్యే సోపానంగా ఉన్న నేటిరోజుల్లో, అనేకదేశాలు ఈ రంగంలో అసాధారణమైన ప్రజ్ఞాపాటవాలతో ముందుకు సాగుతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, మానవుడి దైనందిన జీవితంలో సాంకేతిక పరిజ్ఞానం అన్నది ఒక భాగమై పోయింది. నిద్ర లేచింది మొదలు ఆన్‌లైన్ వ్యవస్థ లేదా కంప్యూటర్లతోనే పని. అవి లేకుండా ఒక్క గంట కూడా గడవని స్థితి ఏర్పడింది. ప్రపంచమంతా కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్-ఏఐ), రోబోటిక్స్, క్యాంటమ్ కంప్యూటరింగ్ వంటి ఆధునిక విధానాలతో ప్రగతివైపు పరుగులు తీస్తుంటే, మనం మాత్రం ఇంకా ఎక్కడో ఉన్నాం. ఈ నేపథ్యంలో, మన దేశం సాంకేతికంగా బాగానే అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఆన్‌లైన్ అక్షరాస్యతలో మాత్రం బాగా వెనుకబడే ఉంటోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అయితే, గతంతో పోలిస్తే మనదేశంలో కూడా కొంతమేరకు ఈ విద్యలో పరిణతి సాధిస్తున్నా, ఇంకా సాధించాల్సింది ఎంతో ఉంది. ఒక్క విద్యారంగంలోనే కాదు, అన్ని రంగాల్లోనూ ఇప్పుడు పైచేయి ఆధునిక సాంకేతిక వ్యవస్థదే. అందుకే విద్యార్థిస్థాయిలోనే కంప్యూటర్ విద్య సాధన చేయాలి. విద్యార్థులు ఆన్‌లైన్ విద్యలో ఆరితేరకపోతే భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుంది. అందుకే ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల స్థాయి దాకా కంప్యూటర్ల విద్యకే ఇప్పుడు ప్రథమస్థానం ఉంటోంది. సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాబ్‌టాప్‌లు వినియోగించడం రాకుంటే అడుగు ముందుకు పడని రోజులు వచ్చేశాయి. పది రూపాయలకి కూరగాయలు కొన్నా ఇప్పుడు డిజిటల్ పేమెంట్ చేయడం సర్వసాధారణమైపోయింది. కానీ, మనదేశంలో సాంకేతిక విద్యను వినియోగించేవారి శాతం ఇతర అభివృద్ధి చెందిన దేశాలకంటే తక్కువగానే ఉంటోంది. తొలినుంచి పేరుకుపోయిన పేదరికం, అసమానతలు, అజ్ఞానం వంటి వాటివల్ల ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అనేకమంది విద్యార్థులు ఇంకా డిజిటల్ విద్యను అందుకోలేకపోతున్నారనే అభిప్రాయాలూ ఉన్నాయి. దేశంలో ఇంకా అక్షరాస్యతే పూర్తి స్థాయిలో లేకపోతే, ఇక డిజిటల్ అక్షరాస్యతలో ఇంకెప్పుడు ఎదుగుతాం?..ఇకనైనా మారుతున్న కాలానికి తగ్గట్టుగా మారాలి. వేగాన్ని అందుకోలేకపోతే వెనుకబడిపోతామని గుర్తించాలి. నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ల పరిజ్ఞానం లేకుంటే పరిస్థితి అంధకారమే. సాధారణ చదువుల వల్ల అటు కుటుంబానికి కానీ, సమాజానికి కానీ ఆశించిన ప్రయోజనం ఉండదనే విషయం గమనించాలి. సాంకేతిక నైపుణ్యానిదే ఇప్పుడు రాజ్యం. అయితే, దురదృష్టవశాత్తూ మనదేశంలోని అనేక రాష్ట్రాల్లోని పాఠశాలల్లో కంప్యూటర్లు కూడా కొరతగానే ఉంటున్నాయి. దీంతో, విద్యార్థులు ఆన్‌లైన్ చదువులకు ఇంకా అలవాటు పడడం లేదు. అందుకు తగ్గట్టుగా ఇంటర్నెట్ సదుపాయం కూడా మనదేశంలో అందరికీ ఉండడం లేదు. నేటికీ మనదేశంలో తగినన్ని కంప్యూటర్ ల్యాబ్‌లు కానీ, వాటిని చక్కగా బోధించే ఉపాధ్యాయులు కానీ, తగినంతమంది శిక్షకులు కానీ లేకపోవడం విచారకరం. చాలా పాఠశాలల్లో అసలు కంప్యూటర్లే లేకుంటే విద్యార్థులకు వాటిని ఎలా వాడాలో ఎలా తెలుస్తుంది? పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను పేదింటి బిడ్డలకు కూడా చేరువయ్యేలా చూడాలి. ఉభయ తెలుగురాష్ట్రాల్లో ఈ పరిస్థితి కొంతమేరకు మెరుగ్గానే ఉంది. కానీ, ఇప్పటికీ మనదేశంలోని అనేక రాష్ట్రాల్లో కంప్యూటర్ల కొరత తీవ్రంగానే ఉందని జాతీయస్థాయి అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దేశంలో 57.9 శాతం పాఠశాలల్లో మాత్రమే కంప్యూటర్లు ఉన్నాయని, అనేక రాష్ట్రాల్లో కంప్యూటర్లు ఉన్న పాఠశాలలు చాలా తక్కువగానే ఉంటున్నాయని నిపుణులు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇకనైనా ఈ కొరతను అధిగమించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ విద్యను విద్యార్థులందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు వీలైనంత చౌకగా, నిరుపేదలకు ఉచితంగా ఇంటర్నెట్ లేదా కంప్యూటర్ సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి. వాటిని ఎలా వినియోగించుకోవాలో తెలియజెప్పే సాంకేతిక శిక్షకులను అన్నిప్రాంతాల్లో నియమించి, ప్రజలకి, సామాన్యులకి కూడా ఉచిత శిక్షణ ఇవ్వాలి. అప్పుడే కొంతమేరకైనా సాంకేతికతలో సామాన్యప్రజలు కూడా ఒక అడుగు ముందుకు వేసే పరిస్థితి వస్తుంది. తద్వారా దేశంలో డిజిటల్ అక్షరాస్యత పెరుగుతుంది. అదే చివరికి దేశపురోభివృద్ధికి కూడా దారితీస్తుంది.

## ఎస్పీ గారూ ట్రాఫిక్‌పై ఓ కన్నేయండి!

నెల్లూరుజిల్లాకి మొట్టమొదట సారిగా ఓ మహిళ జిల్లా పోలీసు బాసుగా వచ్చారు. ఇది చాలా శుభపరిణామం. సహజంగా మహిళా అధికారులు ముక్కుసూటిగా ఉంటారు. విధి నిర్వహణలో కఠినంగా వుంటూ క్రమశిక్షణతో వ్యవహరిస్తారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న దుర్మార్గాలని, దౌర్జన్యాలని సమర్ధవంతంగా ఎదుర్కోవాలంటే అజిత వేజెండ్ల లాంటి వారు పోలీసు బాసుగా ఉండడమే సమంజసమని నా అభిప్రాయం. ముఖ్యంగా రౌడీషీటర్ల ఆగడాలతో నేరపురిగా మారుతున్న సింహపురికి అజిత మేడం రాకతో మంచిరోజులొచ్చాయని భావించాలి. నేరాలతో పాటు నగరంలో ట్రాఫిక్‌పైన కూడా ఎస్పీ మేడం గారు దృష్టి పెట్టాలని నా విజ్ఞప్తి. నగర ట్రాఫిక్ నియంత్రణ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారిపోయింది. వాహన చోదకులు ట్రాఫిక్ రూల్స్‌ని గాలికి వదిలేశారు. తమ ఇష్టారాజ్యంగా ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్క్ చేస్తున్నారు. నిర్భయంగా ఒన్‌వేలలో ప్రయాణిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ వున్నా లేనట్లుగా వుంది. కొత్త పోలీసు బాసు నగర ట్రాఫిక్ విధానానికి కొత్త రూపం కల్పించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకి శాశ్వత పరిష్కారాన్ని సూచిస్తారని ఆశిద్దాం..!

– కే.వీ.కుమార్, బాలాజీనగర్.

## నగర కార్పొరేషన్ బాసు ఆదేశించాడు... సిబ్బంది ఆచరిస్తారా?

నగర కార్పొరేషన్ కమిషనర్ నందన్ తరచూ నగరంలో పర్యటిస్తున్నారు. తన తనిఖీలలో భాగంగా ఆయన ఇటీవల అన్నమయ్య కూడలిలోని ఎన్టీఆర్ పార్కుని సందర్శించారు. పార్కు ముందున్న ఫుట్‌పాత్‌తో సహా పార్కు చుట్టూ ఇష్టారాజ్యంగా అవతరించిన దురాక్రమణలపై ఆయన కన్నుపడింది. మొత్తం దుకాణాలన్నీ తొలగించమని తమ సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. అయ్యగారి ఆదేశాలకి తల ఊపిన సిబ్బంది అవి పాటిస్తారా లేదా అన్నది ఇక్కడ ప్రశ్నార్ధకమే. అక్కడ అక్రమంగా వెలసిన దుకాణాల నుండి మునిసిపల్ సిబ్బంది ప్రతి నెలా అనధికార బాడుగలు వసూలు చేసుకుంటున్నారన్నది జగమెరిగిన సత్యం. మరి తమ బాసు చెప్పగానే వాళ్ళు ఆ అంగళ్ళని తొలగిస్తారా...? అన్నది అనుమానమే. కమిషనర్ గారి శక్తి, ఆయన సిబ్బంది భుక్తి రెండింటిలో ఏది నెగ్గుతుందో చూడాలి!

– ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## వైసీపీకి పదకొండే ఎందుకొచ్చాయి విశ్లేషణ బాగుంది!

గత వారం మన 'లాయర్'లో భోగాది వేంకటరాయుడు రాసిన "ఇప్పటికైనా అర్ధమయ్యిందా... వైసిపికి పదకొండే ఎందుకొచ్చాయో?" విశ్లేషణ చాలా బాగుంది. జగన్ ప్రభుత్వంలో జరిగిన తప్పొప్పులను బాగా విశ్లేషించి, ఇకపై తీసుకోవలసిన జాగ్రత్తలను కూడా సూచించారు. వైసిపి వాళ్ళు, ముఖ్యంగ జగన్ మోహన్‌రెడ్డి కళ్ళు తెరిపించేలా చాలా హృద్యంగా వివరించారు. ముఖ్యంగా భోగాది వేంకటరాయుడు గారు గత జగన్ పరిపాలనని క్లెప్టోక్రసీ(Kleptocracy)గా వర్ణించాడు. నూటికి నూరుపాళ్ళు జగన్ పాలనకు ఆ ఉపమానం చక్కగా సరిపోతుంది. రాయుడి గారికి నా అభినందనలు!

దువ్వూరు జనార్ధన్‌రెడ్డి
చికాగో, యు.ఎస్.ఏ.




### మాదకద్రవ్యాల మత్తులో..

## నేరగాళ్ళుగా మారుతున్న మైనర్లు!

డ్రగ్స్.. డ్రగ్స్.. డ్రగ్స్!.. ఒకప్పుడు ఎక్కడో మహానగరాలలో మాత్రమే వినిపిస్తుండిన మాట ఇది. ఇప్పుడు దేశంలో ఎక్కడ చూసినా ఇదే మాట మారుమోగుతోంది. మహానగరాల నుంచి నగరాలకు, నగరాల నుంచి పట్టణాలకు, పట్టణాల నుంచి చివరికి పల్లెలకు కూడా ఈ విష సంస్కృతి పాకిపోతోంది. దేశవ్యాప్తంగా చాపకింద నీరులా చేరుతూ, పెద్దలనే కాకుండా, చివరికి మైనర్ల(చిన్నారులు) జీవితాలను కూడా ఈ మాయలమారి చిత్తుచేస్తోంది. చదువుకోవాల్సిన వయసులో విద్యార్థులు డ్రగ్స్ (మాదకద్రవ్యాలు)కి అలవాటుపడిపోతున్నారు. తెలిసో తెలియకో వీటిని సరదాగా ఒక్కసారి తీసుకుంటే చాలు, ఇక ఆ మత్తుకు బానిసలైపోవాల్సిందే. చివరికి ఇదో భయంకర వ్యసనంలా మారుతుంది. వారి ఆరోగ్యాలను హరిస్తుంది. జీవితాలను అతి భయంకరంగా కాటువేస్తోంది. గంజాయి, నల్లమందు, హెరాయిన్, కొకైన్, కెటామైన్ పేరేదైతేనేం, ఇలాంటి మత్తుపదార్ధాలు యువత జీవితాలను సర్వనాశనం చేస్తున్నాయి. ప్రభుత్వాలు, మాదకద్రవ్యాల నిరోధక అధికారులు, పోలీసులు ఎన్నిరకాల కఠినచర్యలు తీసుకుంటున్నా, దొంగదారుల్లో ఇవి దేశమంతా విస్తరిస్తూనే వున్నాయి. కళాశాల విద్యార్థులకే కాక, చివరికి పాఠశాల పిల్లలకు కూడా ఇవి ఏదో ఒక రూపంలో గుట్టుచప్పుడు కాకుండా అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. మాదకద్రవ్యాల మాఫియాలు, తయారీదారులు, వాటి రవాణాదారులు స్వార్ధంతో, ధనాశతో సమాజాన్ని విషపూరితం చేస్తున్నారు. దీంతో దేశంలోని అన్ని రాష్ట్రాలలో లక్షలాదిమంది మైనర్లు ఈ మాదకద్రవ్యాల మహమ్మారికి బానిసలై, విషవలయంలో కూరుకుపోతున్నారని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### బాలల్లో పెరిగిపోతున్న నేర ప్రవృత్తి :

పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో విచ్చలవిడితనం పెరిగిపోయింది. మాదక ద్రవ్యాలు, రకరకాల మత్తుపదార్ధాల వాడకం విజృంభిస్తోంది. ముఖ్యంగా మైనర్లు చెడు స్నేహాలకు లోనై పెడమార్గం పడుతున్నారు. ఏదో ఒకరకంగా మత్తులో జోగడం ఒక ఫ్యాషన్‌గా మారింది. తల్లితండ్రులతో పాటు ఎవరి మాటా వినని పెడసరపు ధోరణి ఇటీవలి కాలంలో మైనర్లలో పెరిగిపోయింది. దానికితోడు దేశంలో పబ్‌లు, క్లబ్‌లు పెరిగిపోయాయి. అరచేతిలోకి ప్రపంచం వచ్చేశాక మంచితోపాటు చెడు కూడా అంతే స్థాయిలో కళ్లముందుకు వచ్చేసింది. అత్యంత జుగుప్సాకరమైన అశ్లీలం విచ్చలవిడిగా వీరంగం వేస్తోంది. ఇవన్నీ మైనర్ల మనసుల్ని పూర్తిస్థాయిలో కలుషితం చేస్తున్నాయి. జల్సాలకు అలవాటుపడిన యువత, మైనర్లు ఈజీ మనీ కోసం అర్రులు చాస్తూ, చోరీలకు, నేరాలకు ఘోరాలకు పాల్పడుతున్నారు. చివరికి కరడుగట్టిన నేరగాళ్లుగా కూడా మారుతున్నారు. ఆడపిల్లలపై అఘాయిత్యాలు, ప్రేమ పేరుతో గొంతుకోయడాలు వంటి అరాచక ప్రవృత్తితో మైనర్లు ఇతరుల జీవితాలనే కాకుండా, తమ జీవితాలను కూడా నాశనం చేసుకుంటున్నారు. దీంతో దేశంలో బాల నేరస్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిపోతోంది. మత్తులో జోగుతూ వారు చేస్తున్న రోడ్డు ప్రమాదాలు, విపరీత మనస్తత్వంతో చేస్తున్న అరాచకాలు వగైరాలన్నీ ఈ మాదకద్రవ్యాలు, మత్తుపదార్ధాల ప్రభావం వల్లనేనని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

### తల్లితండ్రుల పాత్రే కీలకం :

పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో గురువుల కంటే ముందు తల్లితండ్రుల పాత్రే చాలా కీలకం. సమాజంలో నైతిక విలువలు నశించి, ఎక్కడ చూసినా వికృత మనస్తత్వాలు, అకృత్యాలు పెచ్చరిల్లిపోతున్న నేటి కాలంలో, పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారిని మంచిమార్గంలో నడిపించాల్సిన బాధ్యత ముందుగా తల్లితండ్రులదేనన్న విషయం వారు విస్మరించకూడదు. అమ్మా, నాన్నలు ఎంత పనివత్తిడితో ఉన్నాసరే, తప్పనిసరిగా ప్రతిరోజూ పిల్లల కోసం కొంత సమయం కేటాయించాలి. పిల్లల మనసెరిగి మసలుకోవడం, ప్రేమగా మాట్లాడడం, వారి ప్రవర్తన గమనిస్తుండడం, వారిలో ఎలాంటి పెడబుద్ధులు చోటుచేసుకోకుండా చూసుకోవడం తల్లితండ్రుల కనీస బాధ్యత. అంతేకాదు, ప్రస్తుత పరిస్థితులలో పిల్లలు ఎలాంటి మత్తుపదార్ధాలకు, మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం కూడా అన్నిటికన్నా ముఖ్యం. ఇప్పటికే దేశంలో అన్నివర్గాల వారు మత్తుకి దాసోహమైపోతున్నారు. ధనిక వర్గాల వారితో పాటు, సామాన్యులు నిరుపేద కుటుంబాల పిల్లలు కూడా మత్తుపదార్ధాల మాయలో పడిపోతున్న సంఘటనలు కోకొల్లలు.

మాదకద్రవ్యాల నిరోధక అధికారులు, పోలీసులు కళాశాల, పాఠశాల స్థాయిల్లో కూడా అవగాహనా సదస్సులు పెడుతున్నారు. మాదకద్రవ్యాలు వాడితే ఎంత ప్రమాదమో వివరిస్తున్నారు. అయినప్పటికీ చెడుమార్గం పట్టి, జల్సాలు మరిగి వాటిపట్ల ఆకర్షితులవుతున్న యువతలో మార్పు రావడం లేదు. ఆటపాటలతో, హాయిగా చదువుకుంటూ వృద్ధిలోకి రావాల్సిన బాలలు, ఇలా మత్తుకి బానిసలై చివరికి తమ జీవితాలను తామే చిత్తు చేసుకుంటున్నారు. ఇకనైనా సమాజంలో ఈ విషసంస్కృతిని పూర్తిస్థాయిలో అంతమొందించాలి. ప్రభుత్వాలు ఈ మత్తుపదార్ధాలను సమూలంగా నిరోధించడానికి మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. మాదకద్రవ్యాల మాఫియాల పట్ల మరింత కఠినంగా వ్యవహరించాలి. అంతేకాదు, ఈ మత్తుపదార్ధాల వాడకం ఎంత ప్రమాదమో ప్రతి బడిలోనూ, కళాశాలలోనూ నెలకోసారైనా ఉపాధ్యాయులు తప్పనిసరిగా పిల్లలకు అవగాహన కల్పించాలి. కనీసం ఒక గంట సమయమైనా కేటాయించి మత్తు పదార్ధాల వల్ల కలిగే అనర్ధాలని వివరించాలి. వాటిని వాడబోమని పిల్లలచేత ప్రతిజ్ఞ చేయించాలి. మేధావులు, స్వచ్ఛంధసంస్థల నిర్వాహకులు, తల్లితండ్రుల కమిటీల సభ్యులు, పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు అందరూ ఏకమై మాదకద్రవ్యాల పట్ల విముఖత కలిగేలా రేపటి తరంలో చైతన్యం తీసుకురావాలి. దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణ ఒక ఉద్యమంలా చేపట్టాలి. లేకుంటే ఆ మత్తు మైనర్లనే కాదు, వారి కుటుంబాలను, చివరికి సమాజ భవిష్యత్తును కూడా నాశనం చేస్తుందనడంలో సందేహం అవసరంలేదు...!

- రాజశ్రీ

## 'వన్ టు వన్ టాక్'తో..
# కార్యకర్తల్లో నూతనోత్సాహం

- రూరల్‌లో మరో వినూత్న కార్యక్రమానికి..శ్రీధర్‌రెడ్డి శ్రీకారం



ప్రజా సమస్యల పరిష్కారంలో కానీ, పార్టీ కార్యకర్తల విషయంలో కానీ అన్ని విధాలా ప్రజలను ఆదుకునేందుకు తానున్నానంటూ నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముందుకు వస్తున్నారు. అందుకోసం తాజాగా మరో వినూత్న కార్యక్రమం చేపట్టారు కూడా. దానిపేరే 'వన్ టు వన్ టాక్'..అంటే, ఒకరితర్వాత మరొక కార్యకర్తతో మాట్లాడడం, వారి బాధలు తెలుసుకోవడం, అవసరమైన సాయం చేయడం దీని లక్ష్యం. కేవలం నెలరోజుల్లో వెయ్యిమంది కార్యకర్తలు, నాయకులతో మాట్లాడి వారి కష్టనష్టాలను తెలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. అందుకోసం 'వన్ టూ వన్ టాక్' కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీకి సేవలందిస్తున్న కార్యకర్తల ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. సాధారణంగా ఎన్నికల సమయంలో మాత్రమే ఎమ్మెల్యేలు తమ కార్యకర్తలు, నాయకులతో సన్నిహితంగా మెలుగుతుంటారు. కానీ, అందుకు భిన్నంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాత్రం ఏ ఎన్నికలు లేని ప్రస్తుత తరుణంలో, పార్టీ కార్యకర్త క్షేమం-సంక్షేమం కోసం ఈ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతుండడం పట్ల పార్టీవర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ఇప్పటికే ఆయన తమ నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. గత మూడు రోజులుగా, రోజుకు దాదాపు నలభైమంది కార్యకర్తలు, నాయకులతో ఒకరి తర్వాత మరొకరితో వివరంగా మాట్లాడుతున్నారు. ఒక్కో కార్యకర్తతో పది నుండి పదిహేను నిమిషాల సమయం కేటాయించి, వారి వ్యక్తిగత కష్టనష్టాలను కూడా తెలుసుకుంటుండడం విశేషం.

## ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..
# పోషణ మాసోత్సవాలు

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లాలోని 12 ప్రాజెక్టుల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 17 నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ తెలిపారు. తల్లీ బిడ్డల సంరక్షణ, సుస్థిర పోషకాహారం వంటి అంశాలపై తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తామని, ప్రత్యేకించి స్థూలకాయం నివారణ, చక్కెర-నూనెల వినియోగం తగ్గించడం వంటి అంశాలపై వారికి సూచనలిస్తామని చెప్పారు.

# వ్యాధులతో జాగ్రత్త!

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని, ముఖ్యంగా కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారిణి హుస్సేనమ్మ సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 16న నెల్లూరులోని సబ్‌యూనిట్ ఆఫీసర్లతో సమీక్షించి, వ్యాధుల గురించి ఆరాతీశారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు పెరిగే ఈ సీజన్‌లో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సహాయ మలేరియా అధికారి వి.నాగార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# 22 నుంచి శరన్నవరాత్రి వేడుకలు

## శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో ఘనంగా ఉత్సవాలు



శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఈనెల 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ గురువారం వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరుగనున్నాయి. వేల సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగనున్న ఈ వేడుకల్లో నిత్యం ఉదయం వేళల్లో అమ్మవారికి విశేష అలంకారాలు, విశిష్ట పూజలు ఉంటాయి. ఈనెల 22వ తేదీ చండీ కలశస్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. ఆరోజు ఉదయం 7.30 గంటలకు అమ్మవారు శ్రీ చండీ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. అదేవిధంగా 23న ఉదయం శ్రీ భవాని అలంకారం, 24న శ్రీ గాయత్రి, 25న శ్రీ అన్నపూర్ణ, 26న శ్రీ మహాలక్ష్మి, 27న శ్రీ గజలక్ష్మి, 28న శ్రీ కాళిక, 29న శ్రీ సరస్వతి అలంకారాలుంటాయి. 30వ తేదీ ఉదయం దుర్గాష్టమిని పురస్కరించుకుని అమ్మవారికి కన్నులపండువగా శ్రీ దుర్గాదేవి అలంకారాన్ని నిర్వహిస్తారు. అక్టోబరు 1న మహార్నవమి సందర్భంగా శ్రీ మహిషాసురమర్దిని అలంకారం ఉంటుంది. రాత్రి 11.20 గంటలకు కలశోద్వాసన చేస్తారు. అనంతరం అక్టోబరు 2వ తేదీ గురువారం నాడు ఉదయం 7.30 గంటలకు శ్రీ రాజరాజేశ్వరి అలంకారం, శమీపూజ, పారువేట ఉత్సవాలతో పాటు సాయంత్రం 5 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకారం చేస్తారు. ఉత్సవాల్లో భాగంగా, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి-సుజిత దంపతులు ఈనెల 24వ తేదీ బుధవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అక్టోబరు 2న రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి నగరోత్సవం నయనానందకరంగా నిర్వహించనున్నారు. అక్టోబరు 3న అమ్మవారి సన్నిధిలో ప్రముఖ దాతలు.. అమ్మవారి భక్తులు ఆల్తూరి గిరీష్‌కుమార్‌రెడ్డి - లత, ఆల్తూరి మహేష్‌కుమార్‌రెడ్డి - రాధికల ఆధ్వర్యంలో పెద్దఎత్తున భక్తులను అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆలయ ఇఒ జనార్దన్‌రెడ్డి తెలిపారు. భక్తులందరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

## త్వరలో మునిసిపాలిటీగా.. కోవూరు! - ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ గ్రేడ్-2 మునిసిపాలిటీగా స్థాయి పెరగడం తనకెంతో సంతోషంగా ఉందని, త్వరలో కోవూరు గ్రామ పంచాయతీని కూడా మున్సిపాలిటీగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తుందని ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చెప్పారు. బుచ్చికి గ్రేడ్-2 మునిసిపాలిటీ హోదా వచ్చిన సందర్భంగా ఆమెను ఈనెల 16న నెల్లూరులోని వారి నివాసంలో బుచ్చి పట్టణ మున్సిపల్ ఛైర్‌పర్సన్, కౌన్సిలర్లు ఘనంగా సన్మానించి, కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల కృషి ఫలితంగానే బుచ్చికి గ్రేడ్-2 మున్సిపాలిటీ హోదా దక్కిందని వారు సంతోషం వ్యక్తం చేశారు. గ్రేడ్-2 మున్సి పాలిటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల కేటాయింపు పెరుగుతుందని తద్వారా రోడ్లు, తాగునీటి సరఫరా, పార్కులు, మెరుగైన డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటుకు వీలవుతుందన్నారు.

# సీసీ రోడ్లు ప్రారంభం

ఇటీవల ఇందుకూరుపేట మండలం జగదేవిపేట గ్రామంలో 50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించడంతో పాటు, మరో 50 లక్షల నుడా నిధులతో నిర్మించనున్న డ్రైన్లకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.





# 'మై టీడీపీ యాప్'పై కార్యకర్తలకు అవగాహన

తెలుగుదేశం పార్టీకి, కార్యకర్తలకు మధ్య 'మై టీడీపీ యాప్' అనుసంధానకర్తగా వుంటుంది కనుక, టీడీపీ కార్యకర్తలందరూ ఆ యాప్‌లో లాగిన్ అవ్వాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఈనెల 16న నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని తమ నివాసంలో ఆమె ఆ యాప్‌పై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆ యాప్‌లో కార్యకర్తలకు పార్టీ విధి విధానాలకు సంబంధించి అధినాయకత్వం నుంచి ఎప్పటికప్పుడు వివరాలు అందుతాయన్నారు. కార్యకర్తలు నాయకులుగా ఎదగాలని ఆమె సూచించారు.

## కాలధర్మం
# బెజవాడ కుమారస్వామిరెడ్డి



నెల్లూరీయుడు, ప్రముఖ కాంట్రాక్టర్ మరియు వ్యాపారవేత్త బెజవాడ కుమారస్వామిరెడ్డి సెప్టెంబర్ 15వతేదీ తమ 76వయేట తుది శ్వాస విడిచారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో వున్నారు. కుమారస్వామిరెడ్డి స్వగ్రామం నెల్లూరు జిల్లా కొండ్లపూడి. బెజవాడ సుబ్బారెడ్డి - రమణమ్మలు ఆయన తల్లితండ్రులు. ఆయన బాల్య విద్యాభ్యాసం నెల్లూరులో ముగిసిన అనంతరం, బెజవాడ లయోలా కాలేజీలో ఇంటర్మీడియట్ చదివి, ఆ తరువాత బెంగళూరు కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ & సైన్స్‌లో బి.ఏ.(చరిత్ర)లో పట్టా పుచ్చుకున్నారు. జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన కాంట్రాక్టర్ గునపాటి రామచంద్రారెడ్డి కుమార్తె శారదని పరిణయమాడారు. వివాహ అనంతరం తన కుమారుడి చదువుతో పాటు వ్యాపార నిమిత్తం 1975లో మద్రాసుకి తరలిపోయారు. మద్రాసు నగరాన్ని తన రెండవ పుట్టినిల్లుగా మార్చుకుని సుమారు 50 సంవత్సరాలపాటు అక్కడే స్థిరపడ్డారు. కాంట్రాక్టులు, వ్యాపారాల నిమిత్తం పలు ప్రాంతాలకి తిరిగే క్రమంలో కన్నడ, మలయాళం, హిందీ భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. స్థిర నివాసం చెన్నై కావడంతో తమిళంలో పండితుడిగా మారారు.

కుమారస్వామిరెడ్డి ఆధునిక భావాలతో పాటు మంచి వ్యాపారదృక్పథం కలిగి వుండేవారు. ఈ క్రమంలో భాగంగా మెడ్యులర్ ఫర్నిచర్, ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు, విదేశ చిత్రాల పంపిణీ(డిస్ట్రిబ్యూషన్), లెదర్ గార్మెంట్స్ ఎగుమతి వంటి వ్యాపారాలతో పాటు కొన్ని దశాబ్దాల కాలం కాంట్రాక్టర్‌గా నిర్మాణ రంగంలో కూడా ఆయన తన ఉనికిని చాటుకున్నారు. పలురకాల దేశ విదేశ కరెన్సీ నాణేలు సేకరించడం ఆయన ప్రవృత్తి.

అనారోగ్య కారణాలతో కుమారస్వామిరెడ్డి కోవిడ్ అనంతరం తన స్థిర నివాసాన్ని హైదరాబాదుకి మార్చుకున్నారు. మృత్యువుతో పోరాడి సెప్టెంబర్ 15న కన్నుమూశారు. ఆయనకి భార్య శారద, కుమారులు కార్తీక్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి వున్నారు. కుమారస్వామిరెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.



# ఒకేరోజు 103 మందికి సాయం

**● కోటి రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**

జిల్లాలో కనీవినీ ఎరుగని రీతిలో ఒకేరోజు 102 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.1 కోటి రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా ఈనెల 17న బాధితులకు అందజేశారు. నెల్లూరు నగరం మాగుంట లేఔట్‌లోని విపిఆర్ నివాసంలో చెక్కులను అర్హులకు పంపిణీ చేశారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో 99 మంది లబ్ధిదారులకు, అలాగే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్లమెంట్ పరిధిలో ముగ్గురు అర్హులకు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ చెక్కులను ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రశాంతమ్మ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 15 నెలల వ్యవధిలో కోవూరు నియోజకవర్గంలో 15 విడతలుగా 362 కుటుంబాలకు 4 కోట్ల 4 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

### మరో బాధిత కుటుంబానికి.. 8 లక్షలు :

ఇందుకూరుపేట మండలం గంగపట్నం వాసి మన్నెం వెంకటేశ్వర్లు నెల్లూరు అపోలో ఆసుపత్రిలో బ్రెయిన్ స్ట్రోక్ తో చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ రూ.8లక్షలు సీఎంఆర్ఎఫ్ సాయాన్ని మంజూరు చేయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, సహకరించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలకు మన్నెం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో.. ఇంజనీర్స్ డే



నెల్లూరు ఏసి స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఇంజనీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్‌లో ఉండే ఏడుగురు ఇంజనీర్లను సన్మానించారు. భారత ఇంజనీరింగ్ రంగానికి ఊపిరి పోసిన మహనీయులు, భారత జాతి కీర్తి ప్రతిష్టల్ని అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన మహామేధావి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను వారు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులు కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాదు, మాజీప్రెసిడెంట్..ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, షేక్ నసీర్ అహ్మద్, బెల్లం చెంచయ్యనాయుడు, బిరదవోలు రామమోహన్‌రెడ్డి, లక్కాకుల శ్రీనివాసులు, పులగల సుబ్బారావు, ఎం నరసింహ చౌదరి, భాగవతుల విజయ రాఘవేంద్ర, ఎమ్ మన్మోహన్, జీవి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# వైభవంగా విశ్వకర్మ జయంతి



ప్రపంచానికి శాస్త్ర సాంకేతిక నైపుణ్యాన్ని అందించిన దివ్య శిల్పి, కార్మికుల పితామహుడు విశ్వకర్మ మహర్షి అని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. ఈనెల 17వ తేదీ బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని వైభవంగా నిర్వహించారు. తొలుత విశ్వకర్మ మహర్షి చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేశారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ శిల్పకళానైపుణ్యం, నిర్మాణ రూపకల్పన, దేవతల రథాలు, ఆయుధాల తయారీకి ఆద్యుడిగా విశ్వకర్మ పూజలందుకుంటున్నారన్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల్లోనే అద్భుతమైన శిల్పకళా నైపుణ్యం ప్రదర్శించిన గొప్ప మహర్షిగా విశ్వకర్మ ఖ్యాతి గడించారని చెప్పారు. చేతివృత్తుల వారికి ఆ మహనీయుడి స్ఫూర్తి, నైపుణ్యం ఆదర్శమన్నారు. రాష్ట్రప్రభుత్వం విశ్వకర్మ జయంతిని రాష్ట్రపండుగగా నిర్వహిస్తుందన్నారు. బీసీ సంక్షేమ అధికారి వెంకటలక్ష్మమ్మ, డిఆర్వో విజయకుమార్, బీసీ కార్పొరేషన్ ఇడి నిర్మలాదేవి, విశ్వబ్రాహ్మణ సేవా సంఘం నేతలు వెంకటశేషయ్య ఆచారి, సుబ్రహ్మణ్యం ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# పేద మహిళకు సీపీఐ నేత..చేయూత



భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత డా. సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ సందర్భంగా ఇటీవల నెల్లూరులోని ఒక పేద మహిళకు సీపీఐ జిల్లా నాయకుడు అరిగెల నాగేంద్ర సాయి జీవనభృతి కల్పించి ఆదుకున్నారు. నెల్లూరు నగరంలోని మూలాపేటకు చెందిన ఆ పేద మహిళ తన జీవనం కోసం ఇటీవల సాయిని సంప్రదించగా, ఆమె కూరగాయలు, పూలు, పండ్లు అమ్ముకునేందుకు వీలుగా ఒక తోపుడుబండిని తయారుచేయించి, దానిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ద్వారా ఆ మహిళకు అందజేశారు. సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయాలను అనుగుణంగా పేదలకు చేయూతనివ్వాలనే తలంపుతో ఆమెకు ఈ సాయం అందజేశానని సాయి తెలిపారు.

# రోడ్డుమార్జిన్ వ్యాపారుల కమిటీ

నెల్లూరులో ఈనెల 14న 18 మందితో రోడ్డుమార్జిన్ వ్యాపారుల జిల్లా కమిటీ ఏర్పడింది. నగరంలోని రామచంద్రారెడ్డి భవన్‌లో జరిగిన ఆ వ్యాపారుల తొలి మహాసభలో కమిటీకి అధ్యక్షులుగా వెంకటేశ్వర్లును, కార్యదర్శిగా మోహన్‌లను నియమించారు. సీఐటియు రాష్ట్ర నాయకురాలు విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి కటారు అజయ్‌కుమార్, జి. నాగేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పదవులను బాధ్యతగా భావించాలి

**--- రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ ---**



తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని రాష్ట్ర పురపాలకమంత్రి డా.పొంగూరు నారాయణ అన్నారు. ఇటీవల నామినేటెడ్ పదవులు పొందినవారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, పదవులను పొందిన వారు దానిని బాధ్యతగా భావించి ప్రజల కోసం పనిచేయాలన్నారు. పోరాటం, కష్టం, త్యాగం, పనితీరు, విధేయత, క్రమశిక్షణ ఆధారంగా పదవులు ఇచ్చామని వెల్లడించారు..సమర్థత చాటిన బూత్ స్థాయి కార్యకర్తలకు రాష్ట్ర స్థాయి పదవులు ఇచ్చామన్నారు. ఈ నేపథ్యంలో పదవులు దక్కించుకున్న కప్పిర శ్రీనివాసులు, ఉచ్చి భువనేశ్వర ప్రసాద్‌లను ఆయన అభినందించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు మంత్రి నారాయణను ఘనంగా సత్కరించారు. టిడిపి సీనియర్ నాయకుడు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఏపీ సివిల్ సప్లై డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య



ఇంజనీరింగ్ రంగానికి అత్యున్నతస్థాయిలో పేరుతెచ్చిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని స్థానిక నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఇంజనీర్స్ డేని పురస్కరించుకుని స్థానిక దర్గామిట్టలో 'ది కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఆర్కిటిక్ అసోసియేషన్' వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రతిభాపాటవాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని వ్యవస్థలు ఇంజనీరింగ్ వ్యవస్థ మీద ఆధారపడి నడుస్తున్నాయన్నారు. ఇంజనీర్‌లు లేకపోతే ప్రపంచ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. అనంతరం పలువురు ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రాథమిక చికిత్సపై అవగాహన



ప్రపంచ ప్రాథమిక చికిత్సా దినోత్సవం సందర్భంగా ఇటీవల నెల్లూరులోని 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే ఆదేశాలతో స్థానిక వెంగళరావునగర్‌లోని మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రాథమిక చికిత్సపై అవగాహన కలిగించారు. ఎన్‌సిసి సెకండ్ ఆఫీసరు గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రీనా భారతి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రాణాపాయంలో ఉన్నవారిని ప్రాథమిక చికిత్స ద్వారా ఎలా కాపాడాలో వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సి. మంజుల వాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




# ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



నెల్లూరులోని పలువురు కవులు కవయిత్రులు ఇటీవల నగరంలోని అన్నమయ్య సర్కిల్ ఎన్టీఆర్ పార్కు వద్ద 'పుస్తకం పిలుస్తోంది' పేరుతో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పెద్దసంఖ్యలో పుస్తకాభిమానులు, నగర ప్రజలు తరలివచ్చి ఈ ప్రదర్శనను తిలకించారు. ప్రముఖ కవులు అవ్వారు శ్రీధర్‌బాబు, జి.శ్రీనివాస్, నారాయణ, బాబు నాయుడు, కవయిత్రి గోవిందరాజుల సుభద్రాదేవిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# సాగునీటికి కొదవలేని జిల్లా.. నెల్లూరు

## సోమశిల జలాశయం వద్ద గంగమ్మకి జలహారతి పట్టిన మంత్రి ఆనం



ఈనెల 14న మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి సోమశిల రిజర్వాయర్ వద్ద 5, 6 క్రస్ట్ గేట్ల ద్వారా పెన్నా నదికి నీటిని విడుదల చేశారు. గంగమ్మతల్లికి పూజలు చేసి జలహారతి నిర్వహించారు. సోమశిల రిజర్వాయర్‌లో 74 టీఎంసీ నీటిని మించకుండా ఉండేవిధంగా క్రమ బద్ధం చేయడానికి ఆ నీటిని పెన్నా నదికి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చుట్టుపక్కల ఐదు జిల్లాలలో లేనివిధంగా జలాశయాలు, ఇతరత్రా నీటివనరులుతో 150 టీఎంసీల నీటిని నిలువ చేసే సామర్థ్యం ఉన్న జిల్లా నెల్లూరు జిల్లాయేనని, సాగునీటికి ఈ జిల్లాలో కొదవలేదని అన్నారు.

### ఆత్మకూరుకు.. మీరు చేసింది శూన్యం

సోమశిల జలాశయానికి నీటి విడుదల అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, ఆత్మకూరుకు మీరు చేసిన అభివృద్ధి శూన్య మని మేకపాటి కుటుంబంపై పరోక్షంగా ధ్వజమెత్తారు. మాజీమంత్రి గౌతమ్‌రెడ్డి అంటే అందరికీ గౌరవమని, తన హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు చెప్తుంటే.. తనపై, ముఖ్యమంత్రిపై వారు విమర్శలు చేయడమేమిటని ప్రశ్నించారు.

## గురుకుల బాలికలకి మెరుగైన వైద్య సేవలు



ఆత్మకూరు ప్రభుత్వ బాలికల గురుకుల పాఠ శాల బాలికలు వారం రోజుల క్రితం జ్వరాల బారినపడి బాధపడుతు న్నారని తెలియడంతో మంత్రి ఆనం ఇటీవల ఆ పాఠశాలను సందర్శించారు. జిల్లా యంత్రాంగం ద్వారా వారికి వైద్యసేవలు అందించి పరిస్థితిని చక్కదిద్దారు. ప్రస్తుతం విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉన్నారని, తిరిగి పాఠశాలకు వస్తున్నారని ఆయన తెలిపారు.



## మారిషస్ ప్రధానికి.. ఆనం స్వాగతం

మారిషస్ దేశ ప్రధాని నవీన్ రామ్‌గూలం ఈనెల 15న కుటుంబసమేతంగా శ్రీవారిని దర్శించుకునేందుకు తిరుమలకు వచ్చిన సందర్భంగా, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు ఘన స్వాగతం పలికి, అనంతరం తిరుమలలో దగ్గరుండి దైవదర్శనం చేయించారు.

## మానవత్వం చాటుకున్న మంత్రి



రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయి బాధపడుతున్న ఓ పేద విద్యార్థికి మంత్రి ఆనం అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈనెల 16న ఆయన ఆత్మకూరు లోని బీసీ గురుకుల పాఠశాల పర్య వేక్షణ సందర్భంగా, ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఓ పేద విద్యార్థి వివరాలను తెలుసుకున్నాడు. ప్రస్తుతం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో మొదట సంవత్సరం చదువుతున్న ఆ విద్యార్థికి తన సొంత ఖర్చుతో కృత్రిమ కాలు ఏర్పాటు చేయిస్తానని, అలాగే వైద్యానికయ్యే అన్ని ఖర్చులను తానే భరిస్తానని భరోసా ఇచ్చారు.

## నదిలో చిక్కుకున్న 18 మంది

- మంత్రి నారాయణ ఆదేశాలతో..రక్షించిన అధికారులు

రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చొరవతో 18 మంది యువకులు ప్రాణా లతో బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఆ యువకులు సమీపంలోని పెన్నా నది లోకి సోమవారం సాయంత్రం వెళ్లారు. అయితే, సోమశిల జలాశయం నుంచి నీటిని విడుదల చేయడంతో పెన్నా నది ప్రవాహం పెరిగింది. దీంతో రెండువైపులా



నీరు రావడంతో యువకులు పెన్నా నది మధ్యలో చిక్కుకుపోయారు. దిక్కుతోచని స్థితిలో సహాయం చేయమని బంధువులకు ఫోన్లుచేసి ఆర్తనాదాలుపెట్టారు. ఆ విష యాన్ని యువకుల తల్లిదండ్రులు స్థానిక డివిజన్లోని టీడీపీ ఇన్‌చార్జిలకి తెలియజే శారు. వెంటనే వారు పెన్నా నదిలో యువకులు చిక్కుకున్నారన్న విషయాన్ని రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణకు తెలియజేయడం, మంత్రి వెనువెంటనే స్పందించి అధికారులను ఆదేశించడం జరిగిపోయింది. నెల్లూరు ఆర్డీవో, పోలీస్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి ఎట్టకేలకు వేకువ సమయానికి వారం దరినీ సురక్షితంగా కాపాడగలిగారు. దీంతో వారి తల్లితండ్రులు, కుటుంబసభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.







### జీఎస్టీ తగ్గడంపై..
# వ్యాపారుల్లో ఆనందం

• ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



జీఎస్టీ తగ్గింపుపై నెల్లూరు నడిబొడ్డున ఉన్న ట్రంకురోడ్డులోని వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని శివాజీ సెంటర్‌లో ఉన్న శివాజీ విగ్రహం వద్ద ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని పలు వ్యాపార సంస్థల నాయకులు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సురేంద్రరెడ్డి మాట్లాడుతూ, సులభతరమైన వాణిజ్య జీఎస్టీ తగ్గింపు ఫలాలను ప్రధాని మోడీ ప్రజలందరికి జీఎస్టీ–2 సంస్కరణల ద్వారా అందిస్తున్నారని అన్నారు. కేంద్రం తాజాగా ప్రవేశపెట్టిన రెండు శ్లాబుల ద్వారా పేద–మధ్య తరగతి ప్రజల ఆర్థిక భారం తగ్గి, పొదుపు చేసుకునే వీలుందన్నారు. ఆరోగ్య జీవిత బీమా పాలసీలపై వస్తు సేవా జీఎస్టీని పన్ను లేకుండా చేసి, ప్రజలందరికీ ఆరోగ్య భద్రతను కల్పిస్తున్నారని ఆయన కొనియాడారు. స్థానిక ప్రభా మెడికల్స్ అధినేత శ్రీనివాసులు మాట్లాడుతూ, మందుల పరమైన వస్తువులపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం, లైఫ్ సేవింగ్ డ్రగ్స్ (ప్రాణాలను కాపాడే మందులు)పై కనీస పన్ను కూడా లేకుండా చేయడం ప్రధాని మానవీయ హృదయానికి నిదర్శనమన్నారు. వెంకట్రామా పుస్తకాల షాపు అధినేత సత్యనారాయణ మాట్లాడుతూ, పుస్తకాలతో పాటు అనేక రకాల సామాగ్రిపై పన్ను లేకుండా చేయడం దేశ చరిత్రలో ఒక్క ప్రధాని నరేంద్ర మోడీకి మాత్రమే సాధ్యమైందని ప్రశంసించారు. వస్త్ర వ్యాపారుల సంఘాల ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ, వస్త్రాలపై జీఎస్టీని స్వల్పశాతానికి, వ్యవసాయ ట్రాక్టర్ ఉపకరణాలపై 5 శాతం, సిమెంటుపై జీఎస్టీ తగ్గడం సామాన్యులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. శివాజీ సెంటర్ మిత్రులు కె.వి సుబ్రహ్మణ్యం, బివిఎస్ రంగరాజన్, హర్షవర్ధన్, భాస్కరరావు, మధుసూదన్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### అమ్మ పేరుతో మొక్కలు నాటిన..
# బుజబుజనెల్లూరు జడ్పీ బాలికలు



నెల్లూరు సమీపంలోని బుజబుజనెల్లూరులో ఉన్న డీవిఎన్ఎం జడ్పీ పాఠశాల విద్యార్థినులు ఆదర్శవంతమైన బాటలో సాగిపోతున్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటుపడాలని, మొక్కల పెంపకమే భవిష్యత్ తరాలకు అందించే గొప్పబహుమతి అని చాటుతూ, ప్రధాని నరేంద్రమోడీ పిలుపును మార్గదర్శకంగా తీసుకుని తమ పాఠశాల ఆవరణలో ఈనెల 15న 'అమ్మ పేరుతో మొక్కలు' నాటారు. నెల్లూరులోని కేంద్ర క్షేత్రప్రచార శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్షేత్ర ప్రచార సహాయకులు పి.హరికృష్ణ పాఠశాల విద్యార్థినుల చేత పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులంతా అమ్మ పేరిట ఒక మొక్క నాటి పర్యావరణానికి మేలు కలిగేలా తమ వంతు కృషిచేయాలని ఆయన కోరారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా, ఆ ఛాయాచిత్రాన్ని తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పంచుకోవాలని సూచించారు. జిల్లా యువజనశాఖ అధికారి ఏ.మహేంద్రరెడ్డి మాట్లాడుతూ, మానవ మనుగడకు చెట్లే ఆధారమని, దేశ పురోగతికి పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని తెలిపారు. రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ షేక్ రసూల్, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణ, అనుముల జయ ప్రకాష్, శాఖవరపు వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అలజడి రేపుతున్న వలసలు




ఇటీవల కాలంలో కొన్ని దేశాల్లో వలసలపై నిరసనలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో ఆస్ట్రేలియాలో పలు నగరాల్లో ఇతర దేశాల నుంచి వస్తున్న వలసలపై భారీ ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన ప్రకటించారు. తాజాగా బ్రిటన్‌లోనూ నిరసనలు జరిగాయి. అమెరికాలో సరిహద్దు గుండా వస్తున్న వలసలపై చట్టాలు, సరిహద్దుల్లో గోడలు – వీటిపై రాజకీయ వాదోపవాదాలు జరుగుతూనే ఉన్నాయి. అమెరికాలో ఇదే ప్రధాన అజెండాగా ట్రంప్ అధికారంలోకి కూడా వచ్చారు. అయితే మనం ఒక ప్రశ్న వేసుకోవాలి – వలస అనేది సమస్యేనా?

దీనికి సమాధానం గ్రహించే ముందు ఇటీవల జరిగిన నిరసన ప్రదర్శనలేమిటో చూద్దాం. యూకే రాజధాని లండన్ నగరం ఇటీవల వలస వ్యతిరేక నిరసనలతో హోరెత్తిపోయింది. యాంటీ–ఇమిగ్రేషన్ కార్యకర్త టామీ రాబిన్‌సన్ ఆధ్వర్యంలో జరిగిన 'యునైట్ ద కింగ్‌డమ్' ర్యాలీలో దాదాపు 1.10 లక్షల మంది పాల్గొన్నారు. ఈ ప్రదర్శన సమయంలో పోలీసులు, నిరసనకారుల మధ్య ఉద్రిక్తవాతావరణం నెలకొంది. రాబిన్‌సన్ నాయకత్వంలోని "యునైట్ ది కింగ్‌డమ్" మార్చ్‌కు సమాంతరంగా, "స్టాండ్ అప్ టు రేసిజమ్" అనే ప్రతిఘటన నిరసన జరిగింది. ఈ ప్రదర్శనలో సుమారు 5,000 మంది పాల్గొన్నారు. ఈ రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరగకుండా నిరోధించేందుకు పోలీసులు భారీగా మోహరించారు. ఈ క్రమంలో నిరసనకారులు పోలీసులపై వివిధ వస్తువులతో దాడులు చేశారు. 26 మంది అధికారులు గాయపడ్డారు. ఇప్పటికే బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టాల్లో ఉండగా, అక్రమ వలసదారులు దేశానికి భారంగా మారారని యాంటీ ఇమిగ్రేషన్ నిరసనకారులు చెబుతున్నారు. వలసల వల్ల తమ జాతీయ గుర్తింపు, సాంస్కృతిక విలువలు ప్రమాదంలో పడుతున్నాయని భావిస్తున్నారు. వలసదారులు దేశ వనరులను వాడేస్తున్నారని, స్థానికుల ఉద్యోగాలను కొల్లగొడుతున్నారని నిరసనకారులు ఆరోపిస్తున్నారు. అంతకు ముందు ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్బోర్న్, కాన్‌బెర్రా, పెర్త్ , ఇతర ప్రధాన నగరాల్లో "మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా" పేరుతో దేశవ్యాప్తంగా వలసలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు జరిగాయి. కొన్ని నిరసనల్లో భారతీయ వలసదారులను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకున్నారు, ముఖ్యంగా 2020 నుండి భారీ సంఖ్యలో భారతదేశం నుండి వలసలు పెరిగాయని ఆరోపించారు. అయితే, అధికారిక గణాంకాల ప్రకారం, వలసల సంఖ్య ఇటీవల గరిష్ఠ స్థాయి నుండి 37% తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. ఈ నిరసనలు అవాస్తవ సమాచారం ఆధారంగా జరుగుతున్నాయని విమర్శకులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా, పాశ్చాత్య దేశాల్లో ఇటీవలి కాలంలో వలసలకు వ్యతిరేకంగా పెరుగుతున్న సెంటిమెంట్లలో భాగంగానే ఆస్ట్రేలియాలో కూడా ఈ నిరసనలు జరిగాయని భావిస్తున్నారు.

ఈ నిరసనలపై ఆయా దేశాల్లో రాజకీయ పార్టీలు అనుసరించే వైఖరులు కూడా ప్రభావితం చేస్తున్నాయి. ఒక పార్టీ వలసదారులకు మద్దతుగా ఉంటుండగా మరో పార్టీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తుంది. ఈ వైఖరి తరచూ రాజకీయ లాభాల కోసం, ఓట్ల ఆకర్షణ కోసం మారుతుంటుంది. ఉదాహరణకు అమెరికాలో వలసవ్యతిరేక భావోద్వేగాన్ని ట్రంప్ ఉపయోగించుకోవడం ఆయన అధికారంలోకి రావడానికి బాగా ఉపకరించింది. ఆస్ట్రేలియాలో వలసలు తగ్గుతున్నాయని గణాంకాలు చెబుతున్నా నిరసనలు జరుగుతున్నాయంటే రాజకీయ ప్రయోజనాలున్నాయనే అర్థం.

**చరిత్ర చెబుతున్న వాస్తవం**

నేటి అమెరికా ప్రపంచానికి శక్తిమంతమైన దేశంగా నిలిచింది. కానీ అది పుట్టింది వలసలతోనే. యూరప్ నుండి వచ్చినవారు స్థానిక అమెరికన్లతో ఘర్షణపడి, యుద్ధాలు చేసి, చివరికి తమ ఆధిపత్యాన్ని నెలకొల్పారు. ఆస్ట్రేలియా కూడా అంతే. యూరోపియన్లు అక్కడికి వలస వచ్చాక స్థానిక ప్రజల సంస్కృతి, జీవన విధానం కుదేలైంది. కాలక్రమేణా కొత్త సమాజం ఏర్పడింది. బ్రిటన్ విషయానికి వస్తే చరిత్రలో ఇదే దేశం ప్రపంచవ్యాప్తంగా వలస వెళ్లి, అనేక దేశాలను జయించి, వనరులను, సంస్కృతులను దోచుకుంది. అటువంటి దేశాల్లోనే ఇప్పుడు వలసలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరగడం విశేషం!

**వలసలో సమస్య లేదు, దోపిడీలో ఉంది**

మానవ చరిత్రలో వలసలు లేకపోతే నాగరికతల ప్రగతి అసాధ్యం. వలసలే నాగరికతలకు కొత్త రూపాలు ఇచ్చాయి. భాషలు, ఆచారాలు, సంస్కృతులు కలగలిపి కొత్త సమాజాలు సృష్టించాయి. అవకాశాల కోసం, భద్రత కోసం, మెరుగైన జీవితం కోసం వలస వెళ్లడం సహజం. ఇది మానవ స్వభావం. సమస్య వలసలో లేదు. వలసదారులను సమాజంలో సక్రమంగా కలపలేకపోవడంలో ఉంది. ఎక్కడైతే వనరుల దోపిడీ జరుగుతుందో, ఎక్కడైతే తక్కువ జీతాలతో కార్మికులను దుర్వినియోగం చేస్తారో, అక్కడే ఘర్షణలు పెరుగుతాయి. ఇలాంటి లోటుపాట్లను సరి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. వలసదారులు భారం అవుతున్నారనే అపోహను సృష్టించడం కంటే, వారికి తగిన వనరులు, ఉద్యోగ అవకాశాలు, సమగ్రత కలిగిన వాతావరణం కల్పించడం పాలకుల కర్తవ్యం.

**సామూహిక దాడులు తప్పు**

ఒకరి తప్పును మొత్తం వలస సమాజంపైనే మోపడం అన్యాయం. వలస వచ్చిన వారిని "ముప్పు"గా చూపించడం సమాజానికి మేలుచేయదు. అసలు సమస్యను మసకబార్చుతుంది. ఉద్రిక్తతల వల్ల వలసదారులు భయాందోళనలో జీవిస్తారు, స్థానికులు అసంతృప్తితో ఉంటారు. ఫలితం సమాజంలో విభజన. దీనికి బదులు వలసదారుల ప్రతిభను, శ్రమను సక్రమంగా వినియోగిస్తే సమాజానికే లాభం. అమెరికాలో ఐటీ రంగంలో, ఆస్ట్రేలియాలో ఆరోగ్య రంగంలో, బ్రిటన్‌లో రవాణా సేవల్లో వలసదారుల కృషి ఎంతమాత్రం లేకపోతే ఆ రంగాలు నిలబడేవి కావు. ఇది వాస్తవం. మనిషి గమ్యం ఎల్లప్పుడూ ముందుకుసాగడమే. కొత్త భూములు, కొత్త అవకాశాలు, కొత్త జీవనమార్గాల కోసం వలస అనివార్యం. వలసను సమస్యగా కాక, అవకాశంగా చూడాలి. సమస్య దోపిడీ అయితే దాన్ని అరికట్టాలి. కానీ వలసదారులను కాదు.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




## డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

నెల్లూరులో ఈనెల 15న డాక్యుమెంట్ రైటర్లు (దస్తావేజు లేఖరులు) పెన్‌డౌన్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో నగరంలోని డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు పాల్గొని తమ సమస్యలు తీర్చాలంటూ పెన్‌డౌన్ సమ్మెలో చేరారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన సాఫ్ట్‌ఫేర్ విధానంలో లోపాల వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయంటూ నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్ల సంఘం, స్టాంపు వెండర్ల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ, డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ సమయంలో ఆధార్ కార్డు, ఓటీపీల వల్ల, ఆటో మ్యుటేషన్ల వల్ల పలు సమస్యలు వస్తున్నాయన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికావాలంటే ఆస్తి కొనేవారు, విక్రయించేవారు ఇద్దరి ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్‌కి ఓటీపీ వస్తుందని, అయితే చాలా సందర్భాల్లో ఓటీపీ రాకపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయని వారన్నారు. దీంతో ప్రజలతో పాటు తాము కూడా ఇబ్బందులు పడుతున్నామన్నారు.

ఈ ఆందోళనలో రాష్ట్ర దస్తావేజుల సంఘం అధ్యక్షుడు పెనుమాక వెంకటసుబ్బారావు, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఛైర్మెన్ సీతాపతిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు గాదె రవికుమార్, నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎలియాజర్, నెల్లూరు – ఒంగోలు సంఘాల అధ్యక్షులు జేవీబీ అశోక్, ఎం.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల నిరసన

విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యల సాధన కోసం రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లాలోనూ పలు ప్రాంతాల్లో ఆయా సంఘాల ఆధ్వర్యంలో గళమెత్తారు. నెల్లూరులోని విద్యుత్‌భవన్ వద్ద ఈనెల 15న భోజన విరామసమయంలో నల్లబ్యాడ్జీలు పెట్టుకుని నిరసనలు తెలిపారు. ప్రభుత్వానికి, విద్యుత్ సంస్థ యాజమాన్యానికి పలుసార్లు తమ సమస్యలు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ ఛైర్మెన్ కొండపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ, సమస్యల సాధన కోసం దశలవారీ ఆందోళనల్లో భాగంగా ఈనెల 19, 20 తేదీల్లో విద్యుత్ సర్కిల్ కార్యాలయాల వద్ద రిలే దీక్షలు, 22న ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. జేఏసీ నాయకులు షేక్ అల్తాఫ్, దామోదర్, వెంకటేశ్వర్లు, విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్ల సంఘం నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక కార్పొరేషన్ కోసం ధర్నా

తమ అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్ కోసం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య ఆధ్వర్యంలో ఈనెల 15న నెల్లూరు కలెక్టరేట్ వద్ద ధర్నాందోళన నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు యానాదుల భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. జిల్లాలోని పలు కాలనీల్లో యానాదులు కనీస సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యానాదుల సంఘం జిల్లా నాయకులు రాపూరు కృష్ణయ్య, మానికల మురళి, ఎం.రవీంద్ర బాబు, తలపల సాంబయ్య వై. పెంచలయ్య, మహిళా నాయకురాళ్లు ఉష, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం గిరిజనుల వినతి

కావలి పట్టణంలోని బుడమగుంట గిరిజన కాలనీ వాసులు తమకు తాగునీటి వసతి, మునిసిపల్ నీటిని సరఫరా చేయాలని కోరుతూ ఈనెల 15న కావలి మునిసిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కి వినతిపత్రం సమర్పించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, నాయకులు జి.మధుసూదన్‌రావు తదితరుల ఆధ్వర్యంలో వారు కమిషనర్‌తో మాట్లాడుతూ, ట్యాంకర్ ద్వారా పోసే నీళ్ళు తాగేందుకు పనికిరావని, గత పదేళ్లుగా తాగునీటికి అవస్థలు పడుతున్నామని, ఇకనైనా శుభ్రమైన తాగునీరందించాలని వారు కోరారు.



## వింజమూరు ఆర్టీసీ బస్టాండ్‌కు కుర్చీల వితరణ

వింజమూరు ఏపీఎస్ఆర్టీసీ బస్టాండుకు వింజమూరుకు చెందిన ధరణి సేవా సమితి ఆధ్వర్యంలో కీర్తిశేషులు యల్లాల చిన్నవెంకటరెడ్డి–శ్రీమతి పుల్లమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఈనెల 16న దాదాపు 25 వేల రూపాయల విలువైన 9 కుర్చీలను సేవాసమితి ప్రతినిధి యల్లాల రఘురామిరెడ్డి ద్వారా బహుకరించారు.

## మూగజీవాలకు టీకా సిద్ధం



పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వం టీకాలు పంపింది. ఈనెల 15 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు పశువైద్యాధికారుల ఆధ్వర్యంలో ఈ టీకాలు వేస్తారు. పశుపోషకులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ఈనెల 15న కందుకూరులోని పశువైద్య కేంద్రంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలుకు ప్రచార పోస్టర్లను ఆయన ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్, అసిస్టెంటు డైరెక్టర్లు జీవీ చంద్రమోహన్, ఇ.చెన్నకేశవులు, కోవూరు పశువైద్యాధికారి డాక్టర్ వై.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్ ఐఎస్టీలో.. పూర్తయిన ఆర్మీ శిక్షణ



ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల ప్రారంభమైన ఆర్మీ శిక్షణా తరగతులు పూర్తయ్యాయని ఆర్మీ అధికారి కల్నల్ అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఆర్మీలో పని చేస్తున్న జవాన్లకు ఎన్‌సిసి అధికారులుగా పనిచేయడానికి అవసరమైన శిక్షణ ఇచ్చామన్నారు. ఆర్మీలో వివిధ హోదాల్లో పని చేస్తున్న, మరియు వివిధ రాష్ట్రాలకు సంబంధించిన 35 మంది ఆఫీసర్లకు శిక్షణ పూర్తిచేసి వారిని ఎన్‌సీసీ విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ ఇవ్వడానికి ఈ శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన ఇలాంటి కార్యక్రమాన్ని ఈ కళాశాలలో నిర్వహించడానికి అనుమతించి మరియు సౌకర్యాలు కల్పించిన కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వారు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం, ఆర్మీ అధికారులకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి ధ్రువపత్రాలను అందించి... అభినందించారు. ఆర్మీ అధికారి కల్నల్ అరుణ్‌కుమార్, ఎన్‌సిసి అధికారి గోవిందు మాధవయ్య, ఆర్మీ జవాన్లు పాల్గొన్నారు.

# విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో విద్యార్థులు రాణించాలి

ఈనెల 15న ప్రఖ్యాత ఇంజనీర్ డా. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని కోట మండలం విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్టీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డేని నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పాల్గొని విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన ఇంజనీరింగ్ నైపుణ్యం, పరిజ్ఞానంతో దేశపురోభివృద్ధికి విశ్వేశ్వరయ్య నిరంతరం శ్రమించారని, ఆ మహనీయుని స్ఫూర్తితో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థినీ విద్యార్థులకు వ్యాస రచన, టెక్నికల్ క్విజ్, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలను నిర్వహించారు. విజేతలకు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి



బహుమతులిచ్చారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. పీవీ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డా. ఎం. శ్రీనివాసులు, అడ్మినిస్ట్రేషన్ డీన్ (అడ్మినిస్ట్రేషన్) డా. డి.శ్రీనివాస్, సివిల్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఇన్‌చార్జ్ పి.దిలీప్‌కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# 50 లక్షలతో స్టేడియం అభివృద్ధి

### --- ఎమ్మెల్యే సునీల్



గూడూరు స్టేడియం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జిందాల్ కంపెనీ సహకారంతో నిర్మించిన నూతన గ్యాలరీని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఇటీవల ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను మున్సిపల్ ఛైర్మెన్‌గా, రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు 40 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని స్టేడియంను ఆధునీకరించామన్నారు. వాకర్స్ కోసం 50 లక్షల రూపాయలతో క్రీడాకారులకు జిమ్, ప్రహరీగోడ మరమ్మతులు, ఓపెన్ జిమ్, నూతన ప్రహరీగోడ, గ్యాలరీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ నిర్మాణంలో జిందాల్, పెన్వర్ కంపెనీలతో పాటు జిల్లా కలెక్టర్, సబ్‌కలెక్టర్ సహాయ సహకారాలు అందించారన్నారు. రిటైర్డ్ ఇ.ఇ గిరినాథ్, డిఈఈ శ్రీనివాసులు, చైతన్య, ఇలియాజ్‌అహ్మద్, షేక్ రియాజ్‌అహ్మద్, మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్ పాల్గొన్నారు.

## కోర్టు ఆవరణలో మెగా లోక్‌అదాలత్



గూడూరు పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈనెల 13వ తేదీ జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్ మాట్లాడుతూ, కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. చిన్నచిన్న గొడవలతో కేసులు పెట్టుకొని కోర్టుల చుట్టూ సంవత్సరాల తరబడి తిరుగుతూ ఉంటారని, ఇరు వర్గాల వారు మాట్లాడుకొని లోక్‌అదాలత్ ద్వారా రాజీ చేసుకుంటే ఇద్దరూ విజయం సాధించినట్లేనని పేర్కొన్నారు. అనంతరం రాజీకుదుర్చుకున్న కక్షిదారులకు లోక్‌అదాలత్ అవార్డులను అందజేశారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బివి సులోచనరాణి, ఏపీపీ లక్ష్మీనారాయణ, బార్ వైస్ ప్రెసిడెంట్ పి.హరిప్రసాద్, న్యాయవాదులు పార్వతయ్య, కోటేశ్వరరావు, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



## జెండా ఉత్సవంలో డీజేలకు అనుమతి లేదు

### - డీఎస్పీ గీతాకుమారి

గూడూరు పట్టణంలో ఈ నెల 21వ తేదీ జరగనున్న ఆంజనేయస్వామి జెండా ఉత్సవం సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులతో గూడూరు పట్టణంలోని రోటరీ భవన్‌లో డీఎస్పీ గీతాకుమారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జెండా ఉత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలని, డీజేలకు అనుమతి లేదని తెలిపారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే వారి గురించి తమకు తెలపాలని, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని నిర్వాహకులను కోరారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ డీజే వల్ల వృద్ధులు, చిన్నపిల్లలకు అనేక సమస్యలు వస్తున్నాయని, గొడవలు జరిగే అవకాశం ఉందని, ఉత్సవ నిర్వాహకులు ఎవ్వరూ డీజేలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. రౌడీషీటర్లు కనిపిస్తే వారిని బైండోవర్ చేసుకోవాలని పోలీసులను కోరారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ ప్రసాద్, సిఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్, ఎలక్ట్రికల్ (వన్‌టౌన్) ఏఈ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీరాజ్‌లో ఇంజనీర్స్ డే



గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంచాయితీరాజ్ డివిజన్ కార్యాలయం మీటింగ్ హాల్‌లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ ఇంజనీర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఈఈ బి.రమణయ్య మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు నూతన సాంకేతికతను అందించిన గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని, నేటి ఇంజనీర్లు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల నుండి ప్రతిభ కనబరచిన 12మంది ఇంజనీర్లను సన్మానించారు. క్లబ్ అధ్యక్షులు ఏ.రమణయ్య, రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.గిరినాథ్, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## శిరోమణిశర్మకి రాష్ట్రస్థాయి పురస్కారం



ప్రముఖ కవి, పంచాంగ శ్రవణకర్త, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఆలూరు శిరోమణి శర్మకి గుంటూరు అపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్రస్థాయి ఉత్తమ బ్రాహ్మణ ఉపాధ్యాయ పురస్కారం అందించింది. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 14వతేదీ శిరోమణిశర్మ ఈ సత్కారం అందుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోన దేవస్థానంలో అవిశ్రాంతంగా ఆయన చేస్తున్న సేవలు, ఉత్తమ తెలుగు భాషా బోధకులుగా ఆయన చేసిన సేవలకుగాను ఈ పురస్కారం అందించారు. ఆలూరు శిరోమణిశర్మ ఉత్తమ బ్రాహ్మణ ఉపాధ్యాయ పురస్కారం అందుకోవడంతో గూడూరు బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, ఉపాధ్యక్షులు కడివేటి రామ్మూర్తి, జనరల్ సెక్రటరీ చిట్టమూరు శ్రీనివాసరావు, ట్రెజరర్ విద్యాలలిత, సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

### కార్మికుల కోసం..

## సీతారాం ఏచూరి నిత్య పోరాటం



కార్మికుల కోసం నిరంతరం పోరాడిన నిత్య శ్రామికుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సీపీఎం నాయకులు జోగి శివకుమార్ తెలిపారు. ఇటీవల ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గూడూరు సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుబ్రహ్మణ్యంరెడ్డి దాతృత్వంతో మినరల్‌వాటర్ పరికరాలను ఏర్పాటు చేశారు. భవన నిర్మాణ సంఘ గౌరవాధ్యక్షులు, సీనియర్ నాయకుడు పుట్టా శంకరయ్య, నాయకులు రమణయ్య, నాగరాజు, చంద్రయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు చేపట్టిన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు జిల్లాకి కొత్త కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా నియమితులయ్యారు. ఇప్పటిదాకా పనిచేసిన కలెక్టర్ ఆనంద్ అనంతపురం జిల్లా కలెక్టర్‌గా బదిలీఅయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారవేదిక ద్వారా అనేక సమస్యలు పరిష్కరించడంతో ఆనంద్ కలెక్టర్‌గా మంచిపేరు తెచ్చుకున్నారు. వివాదాలకు తావివ్వకుండా, తన విధ్యుక్తధర్మం నెరవేరుస్తూ అందరి అభినందనలు అందుకున్నారు. ఆ స్థానంలో కొత్తగా నియమితులైన హిమాన్షు శుక్లా 2013 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి. తొలుత ట్రైనీ కలెక్టర్‌గా విశాఖలో పనిచేసి, ఆ తర్వాత తిరుపతి, విజయవాడల్లో జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. సమర్ధవంతమైన అధికారిగా ఆయనకు పేరుంది. అనంతరం, టూరిజం డైరెక్టర్‌గా, చేనేత జౌళిశాఖ ఎం.డీగా కూడా పని చేశారు. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌గా ఉంటూ, అక్కడ నుంచి సమాచార పౌర సంబంధశాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా ఈనెల 13న బాధ్యతలు చేపట్టారు. జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని, మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు పేరుతో ఏర్పడిన ఈ జిల్లాకు కలెక్టర్‌గా రావడం ఆ భగవంతుని కృపేనని ఆయన అంటూ, శ్రీ పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ప్రజలకు సేవలందిస్తానని ఆయన చెప్పారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఆర్ శంకరన్, అర్జున్‌రావు వంటి కలెక్టర్లు చూపిన బాటలో పయనిస్తా న్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు ఆయన సంప్రదాయ వస్త్రాలతో రావడం, వేదపండితుల ఆశీస్సులు స్వీకరించడం, బాధ్యతలు చేపట్టాక అధికారులు ఉద్యోగులతో కలుపుగోలుగా మాట్లాడడం అందరినీ ఆకట్టుకుంది. ప్రత్యేకించి మీడియా గురించి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాది గణనీయమైన పాత్ర అంటూ, ప్రభుత్వం చేసే మంచిపనులను ప్రజలందరికీ మీడియా తెలియజేయాలని కోరారు. హిమాన్షుశుక్లా సతీమణి కృతికా శుక్లా కూడా కలెక్టరే. పల్నాడు జిల్లా కలెక్టర్‌గా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఏదేమైనా, రాష్ట్రంలోని పలు ఉన్నత స్థానాల్లో సుమారు 12ఏళ్ల పాటు పాలనానుభవం ఉన్న హిమాన్షు శుక్లా జిల్లా కలెక్టర్‌గా రావడంతో జిల్లాలో ఆశించిన స్థాయిలో ప్రజల సమస్యలు తీరుతాయని అందరూ భావిస్తున్నారు. కొత్త కలెక్టర్‌కి 'లాయర్' శుభాకాంక్షలు.

### తొలి మహిళా ఎస్పీగా అజిత...

నెల్లూరుజిల్లా తొలి మహిళా ఎస్పీగా అజితా వేజెండ్ల ఈనెల 15వ తేదీ ఉదయం నెల్లూరులోని పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటిదాకా ఎస్పీగా ఉన్న జి.కృష్ణకాంత్‌ను డీజీ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. విశాఖపట్నం శాంతిభద్రతల డీసీపీగా ఉన్న అజితా వేజెండ్ల స్వస్థలం తెనాలి. నెల్లూరు నారాయణ కళాశాలలో ఆమె ఇంటర్ మీడియట్ చదివారు. మద్రాసు ఐఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశారు. యుఎస్‌లో ఎంఎస్ ఫైనాన్స్ కోర్సు పూర్తిచేసి, అక్కడ కొంతకాలం ఉద్యోగం చేసి అనంతరం స్వదేశానికి తిరిగి వచ్చారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేస్తూ, సివిల్స్ పరీక్షలు రాసి ఐపీఎస్‌కి ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం రంపచోడవరం ఓఎస్డీగా, ఆ తర్వాత అనంతపురం, మంగళగిరి పోలీసు బెటాలియన్ కమాండెంట్‌గా, విజయవాడ, విశాఖపట్టణం డీసీపీగా, గుంతకల్ రైల్వే ఎస్పీగా కూడా పనిచేశారు. ఆమె భర్త రాహుల్‌దేవ్‌సింగ్ కూడా ఐపీఎస్ అధికారే. ప్రస్తుతం ఆయన విజయవాడ రైల్వే ఎస్పీగా ఉన్నారు.



### కలెక్టర్, ఎస్పీలకి సీఎం దిశానిర్దేశం :

జిల్లా కలెక్టర్‌గా హిమాన్షు, ఎస్పీగా అజిత బాధ్యతలు చేపట్టాక, ఈనెల 15, 16 తేదీల్లో విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కలెక్టర్ల సదస్సుకు కూడా వీరిరువురూ హాజరయ్యారు. ముఖ్యమంత్రితోపాటు, రాష్ట్ర ఉన్నతాధికారులు వీరికి రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను తెలియజేస్తూ దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో తొలి మహిళా ఎస్పీగా అజిత వేజెండ్ల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పారు. నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని, గంజాయి తదితర మత్తుపదార్థాల నిరోధానికి పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జిల్లా ఎస్పీగా అజిత వేజెండ్ల, ఏఎస్పీగా సిహెచ్ సౌజన్య, డీఎస్పీగా సింధుప్రియ జిల్లాలో మహిళా పోలీసు ఉన్నతాధికారులుగా ఉండడంతో, నేరాల నియంత్రణకు, మహిళల రక్షణకు, ప్రజల భద్రతకు గట్టిచర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశిస్తున్నారు. కొత్త ఎస్పీ..అజిత వేజెండ్లకు 'లాయర్' శుభాభినందనలు.

## పెరమన మృతుల కుటుంబాలకు 5 లక్షల పరిహారం

### చొరవ చూపిన నేతలు, స్పందించిన ముఖ్యమంత్రి

సంగం మండలం పెరమన గ్రామం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాల వారికి 5 లక్షల రూపాయల వంతున పరిహారం అందించి ఆదుకోవాల్సిందిగా జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. ప్రమాదం విషయాన్ని వారు ముఖ్యమంత్రికి వివరించి, ఈ దుర్ఘటనలో ఏడుగురు మరణించడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు పరిహారం అందించే విషయంలో ముఖ్యమంత్రి వెంటనే స్పందించి 5లక్షల వంతున పరిహారం అందించాలని సూచించారని, ఆమేరకు జిల్లా కలెక్టర్‌కు స్వయంగా ఫోన్‌చేసి మాట్లాడారని వారు తెలిపారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

జిల్లాలోని విశ్రాంత ఉద్యోగుల సమస్యలు తీర్చాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కార్యదర్శి కృష్ణారావు కోరారు. ఈనెల 17న ఆయన నెల్లూరు జర్నలిస్టు భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి, విశ్రాంత ఉద్యోగుల కుటుంబాల కష్టాలు తీర్చాలని విజ్ఞప్తి చేశారు.

# మాట మార్చిన వైసీపీ - స్వరం పెంచిన టీడీపీ

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉత్తరాంధ్ర ప్రజలు పట్టించుకోకపోవడం, గట్టి పట్టున్న రాయలసీమలోనూ చావుదెబ్బతినడంతో అమరావతికే జైకొట్టాలని జగన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో "అందితే జుట్టు అందకుంటే కాళ్లు" అన్నట్లుగా తమ స్వార్థం కోసం రోజుకో మాట, పూటకో నిర్ణయం ప్రకటిస్తూ నవ్యాంధ్ర ప్రజలను జగన్ పార్టీ వంచిస్తోందని తెలుగుదేశం నాయకులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఉచ్చనీచాలు లేని సజ్జల వంటి నాయకులను పక్కన పెట్టుకున్న జగన్‌ను రాజధాని ప్రజలే కాదు, రాష్ట్ర ప్రజలు కూడా నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేస్తున్నారు.

### సిద్ధాంతాలకూ తిలోదకాలు!

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరన్నది జగమెరిగిన సత్యం. అయితే ప్రస్తుతం తమ స్వార్థం కోసం, అవసరం కోసం సిద్ధాంతాలు సైతం శాశ్వతంగా ఉండవని వైఎస్సార్‌సీపీ నిరూపిస్తోందనే వాదనలు జోరందుకుంటున్నాయి. ఎందుకంటే ఆర్థిక, సామాజిక, వ్యాపార, రాజకీయ, సాంస్కృతిక, కళా రంగాల్లో ప్రగతి ఒకే ప్రాంతానికి పరిమితం కాకూడదని, అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వంలో ప్రధాన అంగాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖలను రాష్ట్రంలోని మూడు ప్రాంతాలకూ విస్తరించాలన్నది వైఎస్సార్‌సీపీ సిద్ధాంతం అని జగన్ గతంలో అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. దక్షిణాఫ్రికా తరహాలో ఇక్కడ కూడా మూడు రాజధానులు ఉంటే తప్పేంటని, ప్రజల అవసరార్థం ఉత్తరాంధ్రకు కేంద్రబిందువైన విశాఖలో సెక్రటేరియేట్, అమరావతిలో అసెంబ్లీ, రాయలసీమ ముఖద్వారమైన కర్నూల్‌లో హైకోర్టు ఏర్పాటు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. దీంతో అప్పటి వరకు స్తబ్దుగా ఉన్న అమరావతి ప్రజలు ఆంధ్రుల ఏకైక రాజధానిగా అమరావతే ఉండాలని నిరాహార దీక్షలు, పాదయాత్రలతో పెద్దఎత్తున నిరసనకు దిగారు. అయితే వైసీపీ ప్రోద్భలంతో అక్కడ మూడు రాజధానులే కావాలంటూ మరికొందరు పోటీగా నిరాహార దీక్షలు చేపట్టడం అప్పట్లో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అయితే ఆ సమయంలో ప్రభుత్వంలో ఉన్న వైసీపీ మాత్రం వాటిని పట్టించుకోకుండా అమరావతి రైతుల దీక్షలను అడ్డుకోవడమే కాకుండా, పాదయాత్రలో దొంగ రైతులంటూ అరెస్టులకు దిగడం తీవ్ర చర్చనీయాంశమైంది.

### అమరావతిపై అవాకులు.. చవాకులు!

ఇక నిండు శాసనసభలో తెలుగుదేశం ప్రభుత్వం రాజధానిగా నిర్ణయించిన అమరావతికి మద్దతు తెలిపి, ఆ తర్వాత అదే ప్రాంతంపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఇష్టారాజ్యంగా, తెలివి తక్కువగా నోరు పారేసుకోవడం విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. ఒకరకంగా ఇకపై ఇక్కడి ప్రజలతో తమకు పనిలేదు అన్నట్లుగా ఆ పార్టీకి చెందిన నాయకులు అనరాని మాటలతో అమరావతిని కించపరిచారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో అమరావతి ఓ శ్మశానం, అది కేవలం భ్రమరావతే అని కొందరు నాయకులు వ్యాఖ్యానిస్తే, అందరికి కాకుండా ఓ వర్గానికే పరిమితమైన రాజధాని ప్రాంతం తమ దృష్టిలో కమ్మరావతే అని మరికొందరు దుమ్మెత్తిపోశారు. ఇక అమరావతి దేవతల రాజధాని కాదు రాళ్లు, రప్పలు, ముళ్లకంపలకు నిలయం అంటూ తూలనాడారు. విజయవాడలో కొండపై అమ్మవారు -కొండకింద కమ్మవారు స్థిరపడ్డారంటూ తిట్లదండకం అందుకున్నారు. లక్షకోట్లు కృష్ణానదిలో పోసే ప్రణాళికే అమరావతి అంటూ విమర్శించారు. అంతేకాక ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత కూడా తీరుమార్చుకోకుండా వర్షాలొస్తే అమరావతి కృష్ణానదిలో కలిసిపోతుందని, అక్కడ నిల్వ ఉన్న నీటిని తోడేందుకే ప్రభుత్వానికి ఐదేళ్లు సరిపోతాయని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మరికొందరైతే నీటిపై తేలియాడే నగరాన్ని రాజధానిగా ఎంపిక చేసిన నాయకుడిగా చంద్రబాబు కీర్తి కలకాలం గుర్తుండిపోతుందంటూ ఎద్దేవా చేశారు. ఇంకొందరైతే అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ అంటూ చంద్రబాబు కలలు కంటున్నారని, అయితే నిజానికి అక్కడ ఆక్వావ్యాలీ మాత్రమే వీలవుతుందని, గోదావరికే పరిమితమైన పులస చేపలను అమరావతిలోనూ పెంచేందుకు అవకాశం ఉందని సెటైర్లు వేశారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ అధిష్టానం సడన్‌గా అమరావతిపై పాజిటివ్‌గా స్పందించడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరచింది. జగన్ 2.0లో అమరావతి నుంచే పాలన చేస్తారంటూ ఆ పార్టీ నేత సజ్జల బాంబు పేల్చడం అందరినీ విస్మయానికి గురిచేసింది. పైగా గుంటూరు, విజయవాడ మధ్య ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే భవిష్యత్‌లో రాష్ట్రానికి శ్రేయస్కరం అంటూ అభిప్రాయపడడం చర్చనీయాంశంగా మారింది. పనిలో పనిగా తామెప్పుడూ అమరావతిని రాజధానిగా తీసేయ్యాలని చెప్పలేదని, కేవలం వికేంద్రీకరణలో భాగంగానే కొన్ని విభాగాలను ఇతర ప్రాంతాలకు కేటాయించాలని భావించామని అన్నారు. తెలుగుదేశం నాయకులు తమ పార్టీలో లేనిపోని అబాండాలు వేస్తూ ప్రజల్లో తప్పుడు ఉద్దేశాలు కలిగిస్తున్నారంటూ ఆరోపించారు. దీంతో కూటమి నాయకులు వైసీపీపై అగ్గిమీద గుగ్గిలంలా మండిపడుతున్నారు. సిద్ధాంతాలు లేని మీరా నీతులు చెప్పేది అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రాజకీయ ఊసరవెల్లులు అంటూ..!

"పాముకంటే విషపూరితమైన పార్టీని ప్రజలు ఎప్పటికీ నమ్మరు, అందితే జుట్టు లేకుంటే కాళ్లు, ఓట్ల కోసం నానా పాట్లు, నాటకాల రాయుళ్ల పీక్ పర్ఫామెన్స్" అనిన్నీ అమరావతిపై యూటర్న్ తీసుకున్న వైఎస్సార్‌సీపీని ఉద్దేశించి తెలుగుదేశం నాయకులు చేస్తున్న విమర్శలు. మొన్నటి వరకు అమరావతిని నామరూపాల్లేకుండా చేసేందుకు శతవిధాల ప్రయత్నించిన జగన్ పార్టీ మేకవన్నె పులిలా, రంగులు మార్చే ఊసరవెల్లిలా ఓట్ల కోసం అమరావతి రాగం అందుకుందంటూ టీడీపీ నాయకులు ఒంటికాలిపై లేస్తున్నారు. రాజధాని ప్రాంతాన్ని పతనం అంచుకు తీసుకెళ్లి దాని ఉనికే లేకుండా చేయాలని తాపత్రయపడిన జగన్‌పార్టీ ఇప్పుడు "దెయ్యాలు వేదాలు వల్లించినట్లు" అమరావతిపై సానుకూల ప్రకటనలు చేయడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనం అంటూ విమర్శిస్తున్నారు. రాజకీయాల్లో విలువలు లేని నాయకుడు జగన్ అంటూ మండిపడుతున్నారు. మొన్నటివరకు అమరావతి ఓ రియల్ ఎస్టేట్ వెంచర్ అంటూ దూషించి ఇప్పుడు అదే మా రాజధాని అనడం సిగ్గుచేటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతే ఉండేలా పార్లమెంట్‌లో ఓ తీర్మానం తీసుకొచ్చేందుకూ చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారని, అన్నీ అనుకున్నట్లు జరిగితే ఆంధ్రుల కలల రాజధాని రానున్న మూడేళ్లలో కళ్లముందు సాక్షాత్కారమవుతుందని తెలుగుదేశం నాయకులు స్పష్టం చేస్తున్నారు.

ఇక మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పూర్తిగా రాజధాని నిర్మాణ పనులే ఏకైక లక్ష్యంగా పనిచేస్తుండడం, సీఆర్‌డీఏ నిర్వహణే ఆయన ప్రధాన బాధ్యతగా శ్రమిస్తుండడం అందరికీ తెలిసిందే. ఇప్పటికే కొన్ని జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, సాఫ్ట్‌వేర్ సంస్థలు, వివిధ రకాల కంపెనీలు అమరావతికి క్యూ కడుతున్నాయని, క్వాంటమ్‌వ్యాలీతో చరిత్రలో నిలిచిపోయే గొప్ప రాజధానిగా అమరావతి ఆంధ్రుల ఆశలకు రెక్కలు తొడుగుతుందని కూటమి నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా వైఎస్సార్‌సీపీ యూటర్న్‌తో నవ్యాంధ్ర రాజధాని అంశం మరోమారు విభజిత ఆంధ్రప్రదేశ్‌లో పొలిటికల్ హీట్‌ను అమాంతం పెంచేసింది. రాజధాని రగడ కొత్త రాజకీయ సమీకరణలకు బీజం వేసిందనే చర్చ జోరందుకుంది...!

# ఊరూరా అభివృద్ధి పనులు!

## కోట్లాది రూపాయలతో పల్లెల ప్రగతి - ఎమ్మెల్యే సోమిరెడ్డి



తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లి నియోజక వర్గంలో ఊరూరా అభివృద్ధి పనులు వెల్లువెత్తుతున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. వెంకటాచలం మండలం చెముడుగుంట పంచాయతీలో 1.08 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన ఇటీవల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెముడుగుంటలో రూ.38 లక్షలతో సిమెంట్‌రోడ్లు, డ్రైన్లు, ఎస్టీ కాలనీలో ఎంపీ బీద మస్తాన్‌రావు కేటాయించిన రూ.30 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు మరో రూ.40 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపడుతున్నామన్నారు. వైసీపీ పాలనలో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన డ్రైన్లు నిరుపయోగంగా మారాయని, కేవలం ధనార్జన కోసమే చేసిన పనులు కావడంవల్ల వాటిలో నాణ్యత లేక, మురుగు నీళ్ళు పోయే దారిలేక ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని తెలిపారు. దీంతో దోమలు బాగా ప్రబలి ప్రజలు రకరకాల వ్యాధులతో సతమతమవుతున్నారు. వైసీపీ వాళ్ళు అస్తవ్యస్తంగా చేసిన ఆ పనులన్నిటినీ తామిప్పుడు చక్కదిద్దుతున్నామన్నారు. ఇటీవల అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పలు కీలక అంశాలను ప్రస్తావించారని, ముఖ్యంగా అనారోగ్యానికి కారణమవుతున్న యూరియా వాడకాన్ని పంటల సాగులో తగ్గించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. రైతులు పంట అవసరాలకు సరిపడా మాత్రమే యూరియా వినియోగించాలే తప్ప, చిత్తానుసారం వాడితే ఉపయోగం ఉండదన్నారు. రైతులు నానో యూరియా వాడకంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులందరూ వీలైనంత వరకు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని ఆయన తెలిపారు.

## ఈదూరు ప్రగతికి శ్రీకారం



సర్వేపల్లి నియోజకవర్గంలోని ఈదూరు గ్రామంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల శ్రీకారం చుట్టారు. పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. రూ.60 లక్షలతో రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు, రూ.59 లక్షలతో 185 సోలార్ వీధిలైట్లు ఏర్పాటు చేసిన ఎస్ఇఐఎల్ కంపెనీకి ఈ సందర్భంగా సోమిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. 10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లతో పాటు రూ.80 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని సోమిరెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కర్ణాటక టీడీపీ సీనియర్ నేత రావి మోహన్‌చౌదరి పాల్గొని సోమిరెడ్డికి చిత్రపటాన్ని బహుకరించారు. నాయకులు రాపర్ల బాబు నాయుడు, చిన బాబురెడ్డి, సురేష్‌రెడ్డి, అనిల్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ స్థాయీసంఘాల సమావేశాలు

నెల్లూరు జిల్లా పరిషత్ స్థాయీసంఘాల సమావేశాలు ఈనెల 27వ తేదీ నిర్వహించనున్నారు. ఆమేరకు జడ్పీ ఇన్‌చార్జి సీఇఓ మోహన్‌రావు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో సమావేశయ్యారు. ఆరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏడు కమిటీల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.

## ఐటీఐకి దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేస్తున్నామని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి ఈనెల 16న ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఐటీఐల్లో చేరేందుకు ఈనెల 29న, ప్రైవేట్ ఐటీఐల్లో చేరేందుకు 30న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు

నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల స్కూల్ గేమ్స్ అండర్-19 ఫుట్‌బాలు జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 నుండి కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

## 28న వేద విజ్ఞాన వేదిక సభ

చెన్నైలోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో 165వ ప్రసంగంగా ఈనెల 28న సభ నిర్వహిస్తున్నామని వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై టీనగర్‌లోని కృష్ణాహాల్-ఆంధ్రాక్లబ్ వేదికపై ఆరోజు సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో చెన్నై వివేకానంద కళాశాల సంస్కృత శాఖాధ్యక్షులు, విశ్రాంత ఆచార్యులు..డా. కళ్ళే ప్రశాంత్ పాల్గొని 'మహాకవి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం'పై ప్రసంగిస్తారని, సాహిత్యాభిమానులందరూ తరలిరావాలని వారు కోరారు.

## గణిత ఉపాధ్యాయుని ఘనత



నెల్లూరుజిల్లా అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి గ్రామంలో ఉన్న జడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న చల్లా చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని 'మిషన్ కర్మయోగి'లో భాగంగా 'ఐ గాట్ కర్మయోగి' (ఇంటిగ్రేటెడ్ గవర్న మెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్స్-ఐ గాట్) కార్యక్రమం కింద నిర్ణయించిన వెయ్యికోర్సులను పూర్తిచేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి ఉద్యోగి తమ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు, విషయ పరిజ్ఞానాన్ని మెరుగుపరచుకుని సమర్థవంతంగా పనిచేసేందుకు కేంద్రప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో చంద్రశేఖర్‌రెడ్డి ఏకంగా వెయ్యి కోర్సులను పూర్తిచేయడం విశేషం. దీంతో ఆయన్ను మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.

## లోకానికే ఆదర్శం..శ్రీరామచంద్రుడు

శ్రీరామచంద్రుడు ధర్మానికి నిలువెత్తు ప్రతీక అని, ఆయన మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి అపూర్వమని, లోకానికే ఆదర్శమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త..సింహపురి వైద్యసేవా సమితి వైస్ చైర్మెన్ బాలు సుబ్బారావు అన్నారు. నెల్లూరు సమీపంలోని వెంకటాచలం వద్ద ఉన్న డా.మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాలలో ఈనెల10 నుంచి జరిగిన శ్రీమద్రామాయణ ప్రవచనాలు ఈనెల 16న పూర్తయిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రామాయణం విశిష్టతను వివరించారు. అనంతరం, ఆ వేదికపై రామాయణ ప్రవచనాలు చేసిన ప్రముఖ కవిపండితులు కోట రాజశేఖర్, గిరిజాలక్ష్మి, కొండెపి మురళీకృష్ణ, ఏ.సుబ్బారావు, డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు, డా.ఐ.చక్రపాణి, డా. శ్రీరామకృష్ణ ప్రసాదరావులను ఆయన అభినందించారు. పద్య సారస్వత పరిషత్-మల్లెల రామయ్య నర్సింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలను నర్సింగ్ కళాశాల ఇన్‌చార్జి వేణుగోపాలరెడ్డి, హరిహర ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి శ్రీ రామదండు, ప్రిన్సిపాల్ సుజాష్యామిలి పర్యవేక్షించారు.

## డీకెడబ్ల్యులో రక్తదాన శిబిరం

నెల్లూరులోని డీకెడబ్ల్యు డిగ్రీ కళాశాలలో ఈనెల 16న రెడ్‌క్రాస్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. పలువురు విద్యార్థినులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ డా.టి.గిరి, కన్వీనర్ డా.శ్రీరంజని తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### రాపూరులో ఘనంగా గాడిచర్ల జయంతి

గ్రంథాలయోద్యమ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జయంతిని పురస్కరించుకుని ఈనెల 14న రాపూరు గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సహాయకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గాడిచర్ల వారి సేవలను ఈ సందర్భంగా ఆయన బాలలకు వివరించారు.

### నాగమాంబాపురంలో ఉచిత వైద్యశిబిరం

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని నాగమాంబాపురంలో ఈనెల 14న యామిని న్యూరోకేర్ వైద్యురాలు డా. ఏ.యామిని రోగులను పరీక్షించి మందులిచ్చారు. లయన్స్ క్లబ్ సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ సరాబు నాగేశ్వరరావుతో పాటు కె.మహేష్ పర్యవేక్షించారు.

### కసుమూరు మస్తానయ్య దర్గాలో భక్తుల సందడి

వెంకటాచలం మండలంలోని కసుమూరులోని ప్రముఖమైన మస్తానయ్య దర్గాలో ఈనెల 14న భక్తుల సందడి నెలకొంది. జిల్లా నుంచే కాక తమిళనాడు, కేరళ, కర్నాటక, తెలంగాణ తదితర ప్రాంతాలనుంచి కూడా భక్తజనం తండోపతండాలుగా తరలివచ్చి దర్గాను సందర్శించి ప్రార్థనలు చేసుకున్నారు. నిర్వాహకులు భక్తులకు ఇబ్బంది లేకుండా వసతులు సమకూర్చారు.

### పోతిరెడ్డిపాళెంలో కోడిపందెంగాళ్ల అరెస్ట్

కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలో ఈనెల 14న ఓ కోడిపందెం స్థావరంపై ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి అయిదుగురు పందెం రాయుళ్ళను అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి రూ.1500లతో పాటు, పందానికి సిద్ధంగా ఉంచిన మూడు కోడిపుంజులు, 8 మోటారు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశారు.

### నెమళ్ళదిన్నెలో గాలికుంటు వ్యాధికి టీకాలు

ఉదయగిరి మండలంలోని నెమళ్ళదిన్నె గ్రామంలో ఈనెల 15న పశువైద్య సహాయ అధికారి అక్తర్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో అక్టోబరు 15 వరకు జరుగుతుందని, పశువుల సొంతదారులు తమ మూగజీవాలకు ఈ టీకాలు వేయించుకోవాలని ఆయన సూచించారు.

### ఆత్మకూరులో ఎన్‌సిసి క్యాడెట్ల రక్తదానం

ఆత్మకూరు పట్టణంలోని ఎస్‌వీడీ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు ఈనెల 15న రక్తదాన శిబిరం నిర్వహించారు. 28 మంది ఎన్‌సిసి క్యాడెట్లు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెంచలయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ షాజియానా సుల్తానా, గ్రేసీ, మహేష్ తదితరులు పర్యవేక్షించారు.

### అచ్చెన్నతోపులో అగ్నిప్రమాదం.. వరిగడ్డి దగ్ధం

ముత్తుకూరు మండలం వల్లూరు పంచాయతీ పరిధిలోని అచ్చెన్నతోపులో ఈనెల 15న అగ్నిప్రమాదం జరిగి అన్నదమ్ములు నంద్యాల కృష్ణయ్య-ఏడుకొండలుకు చెందిన 50 ఎకరాల వరిగడ్డి అగ్నికి ఆహుతైంది. అగ్నిమాపక దళాధికారులు వారు వెళ్ళి మంటలను అదుపులోకి తెచ్చారు. దాదాపు 3లక్షల విలువైన గడ్డి కాలిపోయిందంటూ బాధితులు లబోదిబోమంటున్నారు.

### వాశిలిలో ప్రకృతి సేద్యంపై అవగాహన

ఆత్మకూరు మండలం వాశిలి గ్రామంలో ఈనెల 15న వ్యవసాయాధికారి కె.కిషోర్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కలిగించారు. అతిగా రసాయన ఎరువులు వాడితే పంటలు దెబ్బతింటాయని చెప్పారు. ఏపీపీఎన్‌పీ పీఐటి వెంకటలక్ష్మి, ఆత్మకూరు రూరల్ అధ్యక్షుడు సంకర పెంచలయ్యచౌదరి, వీఏఏ నితీష్, గంగా పద్మయ్య పాల్గొన్నారు.

### జొన్నవాడ వద్ద చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ వద్ద పొలాల్లో ఉన్న రెండు చికెన్ వ్యర్థాల వాహనాలను బుచ్చి సీఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. వాహన యజమానులపై కేసులు నమోదు చేశారు.

## జొన్నవాడ కామాక్షమ్మ దేవాలయంలో..

# శరన్నవరాత్రికి భారీ ఏర్పాట్లు

### 22 నుంచి అక్టోబరు 2 వరకు వైభవోపేతంగా వేడుకలు



నెల్లూరుజిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో వెలసివున్న శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణలు, పూల అలంకరణలతో దేదీప్యమానంగావిస్తున్నారు. ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, కరుణామయిగా ప్రసిద్ధి చెందిన శ్రీ కామాక్షితాయి అమ్మవారిని ఈ ఉత్సవాల్లో దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాక, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తజనం తరలివస్తారు. భక్తుల మౌలిక వసతులకు ఎలాంటి లోటు లేకుండా ఆలయ నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగనున్నాయి.

**22న ఉత్సవాలకు కలశస్థాపన :**

ఈనెల 22వ తేదీ రాత్రి 8 గంటలకు గణపతిపూజ అనంతరం శరన్నవరాత్రి ఉత్సవాలకు కలశస్థాపన చేస్తారు. ఉత్సవాల రోజుల్లో ప్రతిరోజూ విశిష్ట అలంకారాలతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. నిత్యం శ్రీసూక్త పారాయణం, దేవీ సప్తశతి, దేవీ భాగవతం పారాయణం ఉంటాయి. అమ్మవారికి శ్రీచక్ర నవావరణ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23న శ్రీ త్రిపురాంబికదేవి అలంకారాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తారు. అదేవిధంగా, 24న శ్రీరక్తబీజ వధ, 25న శ్రీ మధుకైటభ వధ, 26న శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకారాలు చేస్తారు. 27న శ్రీ భండాసుర వధ, 28న శ్రీ మహాలక్ష్మి, 29న శ్రీ సరస్వతి, 30న శ్రీ దుర్గాదేవి అలంకారాలు నిర్వహిస్తారు. మహార్నవమి సందర్భంగా అక్టోబరు 1న అమ్మవారికి శ్రీ మహిషాసురమర్ధిని అలంకారం ఉంటుంది. 2వ తేదీ విజయదశమి పర్వదినం రోజున శమీపూజ, అశ్వవాహన సేవ అనంతరం రాత్రికి ఏకాంత సేవ ఉంటాయని ఆలయ ఇఓ తెలిపారు. నవరాత్రి వేడుకల సందర్భంగా ప్రతిరోజు రాత్రి 7 గంటలకు భక్తులందరికీ ఉచిత ప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ కామాక్షమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## కామాక్షమ్మవారికి బంగారు గాజులు



జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి జొన్నవాడకి చెందిన భక్తులు కందికట్టు బాలకిరణ్, కవిత దంపతులు ఈ నెల 17న బంగారు గాజులు సమర్పించుకున్నారు. 27 గ్రాముల బరువున్న ఆ బంగారు గాజులను ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలకు అమ్మవారి ఆలయంలో పూజలు చేయించారు. తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు.

## మహిళల ఆరోగ్యమే..కుటుంబానికి రక్ష!




మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబానికి క్షేమమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన 'స్వస్థ నారీ–సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఈనెల 17న నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యమే కుటుంబానికి మూలాధారమని అన్నారు. మహిళల్లో పోషకాహారంపై సరైన అవగాహన కలిగించేందుకు ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందించడమే ఈ కార్యక్రమం ధ్యేయమన్నారు. డీఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.మాధవి, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## గోవాలో ఫోటోగ్రఫీ వర్క్‌షాప్

- ఫోటోగ్రాఫర్ మోహన్‌రాజుకు సన్మానం



ఆలిండియా మోస్ట్ ఫేమస్ ఫోటోగ్రఫీ 2.0 వర్క్‌షాప్ ఇటీవల గోవాలో జరిగింది. నెల్లూరు ఫోటోగ్రఫీ అసోసియేషన్ సభ్యుడు లోకేష్, ఫోటోగ్రాఫర్ నాగేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు సీనియర్ ఫోటోగ్రాఫర్ టి. మోహన్‌రాజును సన్మానించారు. ఈ వర్క్‌షాప్‌లో ఫోటోగ్రాఫర్లు జనార్ధన్‌రెడ్డి, సుధీర్, రాధయ్య, జగదీష్, చలపతిరావు, శంకర్ తదితరులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా ప్రముఖ ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ వర్క్‌షాప్‌లో మెంటార్ కె.గణేష్ (గణేష్ అకాడమీ–పూనే) పాల్గొని ఆధునికమైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మరియు జింబల్ ప్రక్రియల గురించి వివరించారు. అహమ్మదాబాద్ గౌతమ్ అకాడమీ నిర్వాహకుడు గౌతమ్ వార్య తదితరులు పాల్గొని ఫోటోగ్రఫీలో మెళకువలు నేర్పారు.

కీ॥శే॥ లేబూరు మాధవరెడ్డి గారు
కోడూరుపాడు

ఉత్తరక్రియలు

లేబూరు మాధవరెడ్డి గారు
కోడూరుపాడు
తేది. 12.09.2025, శుక్రవారం స్వర్గస్తులైనారు.

వారి పెద్దకర్మ
తేది. 24.09.2025
బుధవారం ఉదయం 10.30 గంటలకు
నెల్లూరు, జగదీష్‌నగర్, 4వ వీధి, చిల్డ్రన్స్‌పార్కు రోడ్డు
దగ్గరలోని లీలాతులీఫ్ అపార్టుమెంట్‌లోని
మా స్వగృహమునందు జరుగును.
కావున తెలియజేయడమైనది.

ఇట్లు : కుటుంబసభ్యులు


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com